# కథా మంజరి

పది కథల సమాహారం



కథా మార్గదర్శి


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త



**సెప్టెంబర్ 2020 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari

# కథా సుధాస్వాదనకు

కథా మంజరి

# స్వాగతం




# ఇదీ వరస


| సంఖ్య | విషయం | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | మా జట్టు | i |
| 2. | కృతజ్ఞతలు | ii |
| 3. | కథా కీయం | iii |
| 4. | ఈ నెల విశిష్ట అతిథి | iv |
| 5. | కథా మార్గదర్శి | vi |
| 6. | వినదగునెవ్వరు చెప్పిన (కథల తరువాత) | ix |
| | **కథలు** | |

| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| 1. | మరో తరం | గొర్తి వాణీ శ్రీనివాస్ | 1 |
| 2. | విధి విలాసం | మేడా మస్తాన్ రెడ్డి | 7 |
| 3. | రామ బాణం | భాగవతుల కృష్ణారావు | 14 |
| 4. | సు జలాం సు ఫలాం | బుద్ధవరపు కామేశ్వర రావు | 20 |
| 5. | జంట కవులు | రాజేష్ యాళ్ళ | 26 |
| 6. | కరణేషు మంత్రి | ఓరుగంటి శర్మ | 32 |
| 7. | ఆ ఒక్కరే మనమంతా | పి. పద్మనాభ రావు | 37 |
| 8. | స్నేహమా? | భాగవతుల భారతి | 42 |
| 9. | తల్లి దీవెన | శ్రీ శేష కల్యాణి గుండమరాజు | 46 |
| 10. | క్లియరెన్స్ | ఎం. బిందు మాధవి | 50 |


కథా మంజరి

# ఇంకా మా జట్టు



సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

# కృతజ్ఞతలు

# SPONSORS


## ఈ సంచిక కు ఆర్థిక సహకారం

## OF THIS ISSUE

కథా మంజరి

**శ్రీ అవసరాల రాఘవ రావు**

**శ్రీమతి అవసరాల వెంకట మంగ తాయారు**





# 'కథా'కీయం!

చిన్నప్పుడు మనకి చందమామని చూపెడుతూ, గోరుముద్దలు తినిపిస్తున్నప్పట్నుంచి మనకి 'సర్దుబాటు' అలవాటు అవుతుంది. గోరుముద్ద తినడం మానేసి, చందమామ కావాలనీ మారం చేస్తాం. 'మా బంగారు తండ్రివి కదూ, మనకి చందమామ అందదు నాన్నా. రేపు మనం రైల్లో అక్కడికి వెళ్ళి, తీసుకుందాంలే!' అంటూ ఆ వేళకి మనల్ని 'సర్దుబాటు' ముగ్గు లోకి లాగి, ఆ పూటకి ఆ ముద్దా, ముద్దూ కానిస్తారు. ఇంకొంచెం పెద్దయి, జ్ఞానదంతాలు వచ్చిన తర్వాత 'సద్దుకు పోయే' మనస్తత్వం వచ్చేలా చేస్తారు. ఇక.. పెళ్లి దగ్గరికి వచ్చేసరికి, 'సంసారం అన్న తర్వాత భార్యాభర్తలిద్దరిలో ఎవరో ఒకరు సర్దుకుంటూ పోకపోతే గాని, జీవితం ముందుకు వెళ్ళదు నాయనా!' అంటూ పెళ్ళిరోజే ఇరువర్గాలకి హితబోధలు ఉంటాయి. 'సర్దుబాట్లు' లేకపోతే 'పాట్లు' తప్పవనే హెచ్చరిక కూడా ఉంటుంది. ఆ మాటకొస్తే, ఉద్యోగంలో, వ్యాపారంలో, వ్యవహారాల్లో.. ఒకటేమిటి, సర్వదా సర్దుబాట్లు ఉంటాయి. లేకపోతే సిగపట్లు తప్పవనే విషయం మనందరికి అనుభవపూర్వకంగా అవగతం అవుతుంది. మనం వాటి గొప్పతనం గుర్తించం గాని, శరీరంలో అవయవాలు కూడా కొండకచో ఈ సర్దుబాటు వ్యవహార దోరణిలో మనల్ని నడిపిస్తాయి. ఒక కన్ను గాని, ఒక చెవి గాని, ఒక కిడ్నీ గాని, ఒక ఊపిరితిత్తి గాని... పనిచేయక పోతే, 'నాకు తప్పదు కదా' అని రెండోది సర్దుకుపోతుంది. ఇంకా ఆడగలిగే శక్తి, యుక్తి ఉన్నా సరే ఆటగాళ్లు కూడా కొంత వయసు వచ్చిన తర్వాత, అన్ని 'సర్దుకుని' టాటా చెప్పేస్తారు. కుటుంబంలో అతి ముఖ్య వ్యక్తి హఠాత్తుగా పెట్టి, బేడా సర్దుకుని ఆకాశంలోకి ఎగిరిపోతే, మిగతా వారు ఎన్నో విషయాల్ని సర్దుబాట్లు చేసుకుని జీవనం సాగిస్తారు!

ఇదిగో ఈ నెల కథా కమామీషు అని రాద్దమాని కూర్చుంటే, ఈ సర్దుబాటు మాటలు గుర్తుకు వచ్చాయి! రెండు నెలల మా ప్రస్థానంలో, ముందుకు నడవాలంటే, "సర్దుబాటులు తప్పనిసరి" అని మా ముందు నిలబడ్డాయి. గిరి గీసారని, బుద్ధిగా కూర్చుని ఉంటే, రామాయణమే ఉండేది కాదు. సీత గీత దాటింది కనుకే అదో మహా కావ్యం అయింది. సరిహద్దుల్లో సర్దుబాట్లు జరక్కపోతే, ప్రపంచ పటం ఉండేది కాదు. రాజ్యం ఏలే వారు సర్దుబాటులు చేసుకోక పోతే, అరాచకం ఏర్పడుతుంది. సూక్ష్మంగా చెప్పాలంటే.. శాస్త్ర ప్రకారం వెళితే కోతి పిల్ల పుట్టిందనే సామెత నిజం అవుతుంది. ఈ రెండు నెలల్లో ఈ విషయాలు పూర్తిగా అవగతం అయ్యాయి.

ఎనిమిది వందల పదాలకు మించకుండా కథలు రాయమన్నాం. యువకులకు ప్రాధాన్యత అంటూ, నలభై సంవత్సరాల లోపు వారి రచనలను ఆహ్వానించాం. ఇలా.. నాలుగైదు గిరులు గీసుకున్నాం. ఈ గీతలు "కథా మంజరి" అడుగులకు అడ్డొస్తున్నాయి. కథల్లో 'వాసి' కావాలంటే, మా గీతలకు సర్దుబాట్లు తప్పవనిపించాయి. మంచి కథకి ఈ హద్దులు అడ్డు రాకూడదని, ఇప్పటికి వాటిని దాటుకుని వచ్చేసాం. మనసుకి హత్తుకునే కథలకి పెద్దపీట వేస్తూ, "కథా మంజరి" తో ముందుకు నడుద్దాం! రచయిత మిత్రులు, పాఠక మిత్రులు ఈ 'సర్దుబాటు'లను ఆహ్వానిస్తారనే నమ్మకం ఉంది!

ఇదండీ.. ఈ నెల సర్దుబాట్ల కథా కమామీషు!!

**0**



## ఈ నెల విశిష్ట అతిథి

# శ్రీ ఇందూరమణ

ముల్లు గుచ్చుకుంటే నొప్పి తెలుస్తుంది. చెయ్యి చురికితే మంట తెలుస్తుంది. పస్తులుంటే ఆకలి తెలుస్తుంది. చెమట చిమ్మితే కష్టం తెలుస్తుంది. మనషిని కొల్పోతే మమతానురాగాలు తెలుస్తాయి. ఇవన్నీ అనుభవించిన వాడికి నడత వస్తుంది, నడవడిక అబ్బుతుంది. అందులో కాస్త కవితావేశం ఉంటే మంచి కవో, పెద్ద రచయితో అవడానికి అవకాశం ఉంటుంది. అలా ఉద్భవించిన రచయిత శ్రీ ఇందూరమణ అనబడే లోగిశ వెంకటరమణ. స్వస్థలం, శాశ్వత స్థలం సింహాచలమే! ఎనిమిదో ఏట తండ్రిని కోల్పోయి, తల్లి కష్టపడి సంపాదించే నాలుగు రూపాయలతో విజయనగరం కళాశాలలో చదువుకున్న రోజుల్లోనే, అపరిమిత మైన పుస్తకపఠనం అబ్బింది. తరగతి పుస్తకాలు విజ్ఞానాన్ని ఇస్తాయి గాని, మిగతా పుస్తకాలు విజ్ఞతతో పాటు, వికాసాన్ని ఇస్తాయనే ఆలోచన ఎలాగో మదిలో కలిగింది. రోజు స్కూలుకి నడిచి వెళ్లే దారిలో గ్రంధాలయం మెట్లు ఎక్కి, కనబడిన పుస్తకాలని చదవడం ఓ ఆనందాన్ని, అనుభూతుల్ని ఇచ్చింది. ఏదో ఒక తెలియని టార్గెట్ కనబడింది! అంతలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది చదువుతున్న రోజుల్లోనే తల్లి మరణం ఆశనిపాతమైంది. ఎలాగో రెండో ఏడాది పూర్తి చేసి, జీవన అన్వేషణలో తిరిగి 1977 ఏప్రెల్ లో సింహాచలం చేరి, స్థానికంగా ఉన్న 'అడివివరం సహకార పరపతి సంఘం'లో గుమస్తాగా చేస్తూనే, పుస్తకం మీద ప్రేమతో ఓ గ్రంథాలయం స్థాపించాలనే తపనతో ముందుకు నడిచారు. కష్టపడి డబ్బులు సంపాదించే మార్గం ఎన్నుకోలేదు. కష్టపడి పుస్తకాలు, నలుగురు మిత్రులను కూడదీసే మార్గం ఎన్నుకున్నారు. ఆ దారిలోనే.. శ్రీరామకృష్ణ గ్రంథాలాయన్ని 1977 అక్టోబర్లో నెలకొల్పారు. నిత్యం పుస్తకాలు చదువుకోవడం, చదివించడం చేస్తున్న

రోజుల్లోనే, తనతో ఊర్లో ఉన్న యువకులనందరిని తన వెంట తిప్పుకుంటూనే, వారికి తనలోని సాహిత్య కాంక్షని అంటించారు. అలా పది మంది రచయితలను తనకు తోడుగా తయారుచేసుకున్నారు. వారిలో ప్రముఖ సినీ గీతరచయిత "కులశేఖర్" ఒకరు. విజయనగరం కాలేజీలో చదువుతున్న సమయంలోనే, పదిహేడవ ఏట రాసిన మొదటి కథ "అద్దె కొరకు" 1977 మార్చి నెల 'అనామిక' మాసపత్రికలో ముద్రితమైంది. ఆ తర్వాత ఆ అనుభవంతో శ్రీ ఇందూరమణ కలం ముందుకు పరుగందుకుంది. అనుభవాలతోనే ఇప్పటి వరకు 240 కథలు, 12 నవలలు రాసారు. రాసి, వాసి పుష్కలంగా ఉన్న శ్రీ ఇందూరమణ కథలకు, నవలలకు బహుమతులు, పురస్కారాలు, ప్రశంసలు రావడంలో ఆశ్చర్యం లేదు. ఆ అనుభవంతోనే ఉషాకిరణ్ మూవీస్ సంస్థలో కథాపరామర్శకుడిగా కొంతకాలం పని చేసారు. "ఇందూరమణ సాహిత్యం - ఒక పరిశీలన" అనే అంశంగా, ఆంధ్రాయూనివర్సిటిలో తిరుపతిరావు అనే విద్యార్థి పి.హెచ్.డి. చేస్తున్నారు. వీరి కథలు ఇతర భాషాల్లో అనువదింపబడి మన్ననలను పొందాయి. ఎన్నో సాహితి సంస్థల స్థాపనలో తన ముద్ర వేసారు. ఐదువందల మంది తెలుగు రచయితలతో "ప్రియమైన కథకులు", "ప్రియమైన రచయితలు" అనే సంస్థలను స్థాపించి, సభలు సమావేశాలు నిర్వహించడమే కాకుండా, ప్రతి రోజు వాట్సాప్ గ్రూపుల్లో కథలు, కవితలు రాసేలా వారిని ప్రోత్సహిస్తూ, కవులను, రచయితలను తయారు చేసే ఓ పరిశ్రమని ముందుకు నడిపే బాధ్యతని చేపట్టడం శ్రీ ఇందూరమణ గారి ప్రత్యేకత అని చెప్పాలి. రచయితల సంక్షేమం, వారి ప్రచురణలకు ఓ మార్గం చూపే ఓ ఆలోచనతో ముందడుగు వేస్తున్న శ్రీ ఇందూరమణ గారు, ఈ నెల మన 'కథా మంజరి' కథల న్యాయ నిర్ణేతగా, మన విశిష్ట అతిథిగా విచ్చేసి, ఓ ప్రముఖ కథా రచయిత, సంపాదకుడు కీ.శే. దాట్ల నారాయణమూర్తి రాజు గారిని పరిచయం చేసినందులకు.. కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

**O**

# కథా మార్గదర్శి

# దాట్ల  నారాయణమూర్తి రాజు



**జననం:31-10-1956     మరణం:31-05-2000**

మనిషి జన్మకి సార్థకత ఉండాలంటారు.  కాయలు కాయని కొమ్మ.... కారణం లేని జన్మ ఉండకూడదు! ఉంటే అది వ్యర్థమే!!  అలా కాకుండా కొందరు కారణజన్ములూ ఉంటారు. వారిలో  కీర్తిశేషులు దాట్ల నారాయణమూర్తి రాజు గారు ఒకరు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, దాట్ల తన సాహితీ పరిమళంతో పదిమందిని ఆకర్షించేవాడు.  విజయనగరం వినువీధుల్లో విహంగమై విహరించిన ఓ గొప్ప కథకుడు దాట్ల. 1975-1977 ప్రాంతంలో నేను సింహాచలం నుండి చదువుకోడానికి విజయనగరం వెళ్ళాను.  రోజూ నాలుగు కిలో మీటర్ల అవతల నుండి రాజ్యలక్ష్మి థియేటర్ దగ్గర ఉన్న విద్యార్థి భోజన సత్రానికి అయ్యకోనేరుగట్టు మీదగా  నడిచి వెళ్తున్నప్పుడు మార్గం మధ్యలో కనిపించే కోట ప్రక్కన ఉండే రాందాసు బుక్ స్టాల్ వద్ద ఆగి, కొత్త పాత పుస్తకాలు తిరగేస్తే గాని కదిలేవాడిని కాను. అదిగో... అక్కడే దాట్ల గురించి వింటూ ఉండేవాడిని. అంత వరకూ ఆయన్ని చూసెరగను.  మహారాజా సంస్కృత కళాశాలలో బాషా ప్రవీణ చదువుతున్న దాట్ల... తన మిత్రులతో చైతన్య సాహితీ అని ఓ సాహిత్య సంస్థ నిర్వహిస్తూ ఉండేవాడు. అందులో నిత్యం కవి సమావేశాలు, సమ్మేళనాలు జరుగుతాయని చెప్పి,  నాకు తెలీకుండానే నా పేరు వేయించేసాడు బుక్ స్థాల్ యజమాని రాందాసు గారు. 'ఇందూ రమణ' పేరు అచ్చులో చూసుకోవడం అదే.  అదిగో  అప్పుడే ... చైతన్య సాహితీ కవిసమ్మేళనం లోనే.. నా కలం పేరు పుట్టి పురుడు పోసుకుంది. అదిగో...  అప్పుడు చూసాను దాట్ల నారాయణమూర్తిరాజుని!  సన్నగా.. జెండా కర్రలా  ఉన్నా, వంకీలు తిరిగిన జుట్టు  కోల మొహం, సూది ముక్కు... ఆ ముక్కు  మీద ఉండుండీ జారిపోతున్న కళ్ళజోడు... షరాయి కళ్లీలాల్చీ వేసుకున్న దాట్లని,

ఒక్కసారి చూస్తే ఎన్నో ఏళ్ళుగా పరిచయం ఉన్న మనిషిలా కనిపిస్తాడు. కొత్త వారు కనిపించినా, తెలిసిన వారు కనిపించినా కొత్తాపాతా తేడా లేకుండా పలకరింపుగా ఆయన పెదవుల మీద చిన్న చిరునవ్వు మెరుస్తూ ఉంటుంది. అదిగో... ఆరోజుల్లోనే, యువ, స్నేహ, సౌమ్య ,జ్యోతి మాస పత్రికలలోనూ... ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి లాంటి వార పత్రికలలోనూ.. ఏ పత్రిక తిరగేసినా దాట్ల కథలే కనిపించేవి. దాట్ల కథ కనిపిస్తే చదవకుండా కదిలేవాడిని కాదు. నిజం చెప్పాలంటే నాకు తెలిసిన దాట్ల... ఆయన రాసిన కథలు.. నన్ను బాగా ప్రభావితం చేసాయనే చెప్పాలి. దాట్ల కథల్లో ఎత్తుగడ... కథ నడిపే విధానం... కథ వెనుక కళ్ళకు కట్టినట్టు రాసే నేపథ్యం... సరళమైన సంభాషణలు.. ఊహకందని ముగింపు.... ముఖ్యంగా కథలకు ఎన్నుకునే శీర్షికలు .... అన్నీ నన్ను అమితంగా ఆకర్షించడమే కాదు... ఆవహించేసాయనే చెప్పాలి! దాట్ల కథా శీర్షికలు ఎలా ఉండేవంటే.... 'ఆ!'...'.ఓ..' 'ప్చ్'.... అని ఏకాక్షరాలతో ఆశ్చర్యం కలిగించే పేర్లు పెట్టేవాడు. తొలుత కవితలతో మొదలైన నేను, కథకుడిగా మారడానికి ప్రధానంగా దాట్ల కథలే ప్రేరణ! ఆయన కథా రచనా విధానమే పరోక్షంగా నన్ను కథకుడిగా తీర్చి దిద్దాయని గట్టిగా చెప్పగలను. దాట్ల గొప్ప కథకుడే కాదు. గొప్ప స్నేహశీలి కూడా! ఆయన విశాఖలో ఓ పాఠశాలలో తెలుగు టీచరుగా పని చేస్తున్నప్పుడు తరచూ కలుసుకునే వాళ్ళం. శనివారం సాయంత్రం సింహాచలం వచ్చి, సోమవారం ఉదయం నేరుగా పాఠశాలకే వెళ్లేవాడు. ఆ సమయంలో మధుచక్రవర్తి (ఫొటో గ్రాఫర్) రూప దంపతులు దాట్లతో చాలా సన్నిహితంగా ఉండేవారు. దాట్ల స్నేహశీలి అని ముందే చెప్పా కదా. ఒక మిత్రుడి మొదటి నవల, ఉదయం దిన పత్రికలో సీరియల్ గా ప్రారంభమైనప్పుడు, ఆ నవలలో మూడొంతుల భాగం దాట్లే రాసాడు. ఆ రచయిత ఈ రోజు నూట పాతిక పై చిలుకు నవలలు రాసి ఉండొచ్చు గాక. ఆ రచయిత మొదటి నవల ఓసారి చదివి చూడండి. మధుచక్రవర్తి, రూపల పాత్రలు కనిపిస్తాయి. ఇది ఆ రచయితను కించపరచడానికి చెప్పలేదు. మిత్రుడు దాట్ల ఔదార్యం ఎలాంటిదో చెప్పడానికే చెప్పాను. దాట్ల చుట్టూ ఎప్పుడూ మిత్రబృందమే ఉండేది. అతని సావాసం వలన ఎంతో మంది కథా సాహిత్యం బాట పట్టిన వారున్నారు. అంత మంచి కథకుడు అర్థాంతరంగా మాయమైపోవడం సాహితీ లోకానికి తీరని లోటు! దాట్ల రాసిన కథలతో "ఊగరా.. ఊగరా" అనే కథల సంపుటి ఒకటి మాత్రమే వచ్చింది. దాట్ల కథల్లో "దివాణం కథలు" చెప్పుకోదగ్గవి. దాట్ల ఆరు నవలలు కూడా రాసారని తెలిసి ఆశ్చర్యపోయాను. "అరచేతిలో నరకం" ఉదయం దిన పత్రికలో సీరియల్ గా వచ్చినప్పుడు, నేను హైదరాబాద్ లో, ఉషాకిరణ్ మూవీస్ లో కథాపరామర్శకుడిగా పని చేసేవాడిని. "ముని వేలు మీద ముద్దు","ప్రేమగానం" "ఆమెలో అతను" "అరకు లోయలో వాళ్లిద్దరూ" "జనవరి 5" ఇవన్నీ దాట్ల రాసిన నవలలు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం ఆకుల ములగాం లో జన్మించిన దాట్ల చివరి రచన, ఆయన చనిపోయిన వారం తర్వాత వచ్చిన స్వాతి వారపత్రికలో, "పడవెళ్లిపోయింది" కథగా అచ్చయింది. ఇంత మంచి రచయిత రాసిన రచనల మీద, ఇంత వరకూ ఎవరూ పరిశోధన చేయక పోవడం

చాలా బాధాకరం.  ఇదే విషయం నేను "ముఖ పుస్తకం"లో ప్రస్థావిస్థే అది చూసి ప్రముఖ సినీ దర్శకుడు వంశీ నాకు ఫోన్ చేసి,  దాట్ల కథలు అన్నీ పబ్లిష్ చేయించే బాధ్యత తనదేనని చెప్పారు. దాట్ల మన మధ్య లేకపోయినా ఆయన సాహిత్యాన్నైనా మనం వెలుగులోకి  తీసుకువద్దామనే ఆలోచనలో ఉన్నాను. ఇది ఔత్సాహిక రచయితలకు ఓ మార్గదర్శిగా పనికొస్తుంది, పరిశోధన చేసే వారికీ ఉపయోగపడుతుంది.   ఈ సందర్భంగా నైనా ఓ మంచి రచయితని .... ఓ గొప్ప కథకుడ్ని తలచుకునే అవకాశం కల్పించిన "కథా మంజరి" నిర్వాహకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

మరొక్క మాట... కథామంజరి వారు చేస్తున్న ఈ కథా యజ్ఞానికి మీరూ.. నేనూ.... అందరం చేయవలసింది ఒక్కటే,, కథా రచయితలు, కథా అభిమానులు ఈ కథలను చదవడమే కాదు. ఈ పది కథలు,  పది మందికి చేరేలా కృషి చేద్దాం.

మనిషో పది మంది ఈ మెయిల్ కి ఈ కథా మంజరి పంపించండి,  ఆ పది మందికి చదివే భాగ్యం కలిగించండి. వారూ మరో పదిమందికి ఈ కథామృతాన్ని పంచితే.. తెలుగు కథని చిరంజీవిగా నిలబెట్టిన వారవుతారు!!

జై తెలుగు కథ...   జైజై తెలుగు భాష !


**ఇందూ రమణ**

# మొదటి బహుమతి

# మరో తరం

## గొర్తి వాణీ శ్రీనివాస్





# మరో తరం

**గొర్తి వాణి శ్రీనివాస్**

"**నా** యింటి మహాలక్ష్మిని ఇంతవరకూ నేను ఎత్తుకోనేలేదు .. ఏమ్మా! ఈ మామ్మ మీద అలిగావా తల్లీ? వద్దురా .. మీ మామ్మ తెలివి తక్కువది. బంగారాన్ని ఇనపముక్క అనుకునే దద్దమ్మ. దామ్మ దామ్మ బంగారం!" అంటూ అత్తగారు నా కూతుర్ని ముద్దులాడుతుంటే నమ్మలేకపోయా.

అత్తగారు నెల నిండని పిల్లతో చెపుతున్న మాటలన్నీ నాతోనే, నేను వినాలనే అని నాకు తెలుసు. ఆవిడలో ఇంత మార్పు!! కారణం ఏమైవుంటుందీ అని ఆలోచిస్తున్నాను

"పిల్లకి ఏం పేరు పెడదాం వసుధా?" అన్నారు అత్తగారు నా కళ్లలోకి ప్రసన్నంగా చూస్తూ. "అమృతవల్లి అని పెడదాం అనుకుంటున్నాను అత్తయ్యా!"అన్నాను " నీ కూతురికి నా పేరు పెట్టుకుంటావా?...చాలా సంతోషంగా ఉందే. బుజ్జమ్మా నువ్వు నా పేరు నిలబెడతావా?" అంటూ ఏవేవో కబుర్లు చెబుతూ మనవరాలిని ఎత్తుకుని ముద్దులాడుతూ ఇల్లంతా తిప్పి చూపిస్తుంటే సంతోషం కలిగింది నాకు.

నెల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

"మళ్లీ ఆడపిల్లేనా?" లోపలికి అడుగు పెడుతూనే అత్తగారి నోటినుంచి వచ్చిన మొదటి మాట..

హాస్పిటల్ బెడ్ మీద నా పక్కనే నిద్రపోతున్న పసి గుడ్డు వంక అత్తగారు తిరస్కార భావంతో చూడటం నేను తట్టుకోలేకపోయాను! నాకు చాలా బాధగా అనిపించింది. అభం శుభం తెలియని పసిబిడ్డ ఏం చేసిందని? ముద్దులొలికే ఆ అమాయకపు మొహం చూస్తున్నప్పుడైనా ఆడైనా, మగైనా దేవుడిచ్చిన ఫలం అనుకుని కళ్లకద్దుకుని స్వీకరిస్తారనుకున్నాను. ఏవగింపుగా చూడటానికి ఆవిడకి మనసెలా ఒప్పింది.

ఆక్రోశం నా కళ్ళల్లోంచి బయటకు ఉబికింది. ఆడపిల్ల పుట్టిందని తెలిసిన వెంటనే చూడ్డానికి హాస్పిటల్ కి రాలేదు ఆవిడ. మనవడు పుట్టాలని దేవుళ్లందరికీ మొక్కుకుంది. నాచేత జంట నాగుల గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించింది. ముడుపులు కట్టించింది.

అణుర్ బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్ |
అధృత స్స్వధృత స్స్వాస్థ్యః ప్రాగ్వంశో వంశ వర్ధనః ||

అనే శ్లోకం సంపుటి చేస్తూ ప్రతిరోజూ చదివించింది

మనం తలచిందొకటి దేవుడు రాసిపెట్టింది ఒకటి. భగవంతుడి చర్యలకు ఏదో బలమైన కారణమే ఉండి ఉంటుంది... అని ఆవిడ అనుకోలేదు.

మూడో రోజు పథ్యం పట్టుకుని వచ్చారు. ఇంట్లోనే తెలగ పిండి, బీరకాయ కూర పాలుపోసి వండి, వెల్లుల్లి కారప్పొడి చేసి, భోజనం క్యారెజీ ఇంటినుంచి తీసుకువచ్చారు. "అన్నం పెట్టండి పిల్లకి పొద్దుపోయింది" అని మా అమ్మతో చెప్పి రూము బయట బల్లమీద ముభావంగా కూర్చున్నారు.

"అత్తగారి మొహంలో సంతోషం చూడాలని నాకు మాత్రం వుండదామ్మా? ఇప్పుడు ఆవిడ అంత బాధపడాల్సిన అవసరం ఏముంది?" అన్నాను ఉక్రోషంగా.

క్యారెజీ విప్పి బాక్స్ లోనే బీరకాయ కూర కలిపి ముద్దలు చేసి నా నోట్లో పెడుతూ, అమ్మ నా వైపు నిస్సహాయంగా చూసింది.

"మగపిల్లాడు పుట్టలేదనే చింత ఆవిడది! మెల్లిగా ఆవిడే మనసు సర్ది చెప్పుకుంటారులే బాలింత కన్నీళ్లు పెట్టుకోకూడదు!" అంటూ నన్ను ఓదార్చింది.

నా పెద్ద కూతురు సంహితను స్కూల్ నుంచి నేరుగా హాస్పిటల్ కి తీసుకు వచ్చారు మా వారు.. చెల్లెలిని చూసుకుని సంహిత కేరింతలు కొట్టింది. సంహితకి ఆరేళ్ళు .. రెండేళ్ళ క్రితం ఒక ఆడపిల్ల పుట్టి, పురిటి లోనే పోయింది.

"మనకి సంహిత ఒక్కత్తే చాలు. ఇక పిల్లలు వద్దు" మా వారితో అన్నాను.
కానీ అత్తగారు ఒప్పుకోలేదు.

"వంశోద్ధారకుడు లేకపోతే ఎలా? ఈ వంశం వీడితోనే ఆగిపోతే పైనున్న మీ మావగారి ఆత్మ శాంతించదు. మొగ నలుసును కళ్ళ చూడకుండా ఆపరేషన్ చేయించుకోవడానికి ససేమిరా వీల్లేదు!" అని కరాఖండీగా

చెప్పేసరికి మా వారు ఆవిడ మాటను ఎదురు చెప్పలేకపోయారు.  మేము హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళటానికి సామానంతా సర్దేసింది అమ్మ. అమ్మను చూస్తుంటే నాకు జాలేసింది.  ఓపిక కూడదీసుకుని నాకోసం పాపం కష్టపడుతోంది.

మేము నలుగురం ఆడపిల్లలం. మా నానమ్మ మగ పిల్లాడికోసం పట్టుపట్టింది.

'ఆపరేషన్ చేయించుకుంటే భ్రూణ హత్యాపాతకం చుట్టుకుంటుందని దేవుడు ఇచ్చినంత కాలం పిల్లల్ని కనాల్సిందే!  మా కాలంలో ఈ ఆపరేషన్లు ఉన్నాయా?'  అంటూ వితండవాదం చేసి మా నాన్న నోరు మూయించింది.

చివరికి అమ్మ ఆరోగ్యం పాడవటంతో నాన్నే రహస్యంగా ఆపరేషన్ చేయించుకున్నారుట.  ఆ విషయం తెలిసిన నానమ్మ ఆవిడ పోయే వరకూ సాధిస్తూనే ఉంది.  నాన్న ఎలిమెంటరీ స్కూల్ మాస్టారుగా చేసి రిటైర్ అయ్యారు. షుగర్ ఎక్కువ కావడంతో కళ్ళు కనిపించక ఇబ్బంది పడుతుంటే మా రమక్క తీసుకెళ్లి తన దగ్గరే ఉంచుకుని మందులు ఇప్పిస్తోంది.  మిగిలిన ఇద్దరక్కలూ ఒకరు తెనాలిలో, ఒకరు మచిలీపట్నం లో వుంటున్నారు. రమక్క పిల్లలిద్దరూ పెళ్లిళ్లు అయి అమెరికాలో వుంటున్నారు.   కాలం మారుతోంది అంటారు కానీ మనుషుల మనస్తత్వాలూ ఆలోచనలు మారకపోతే ఏ కాలమైనా ఒక్కటే.  మా అత్తగారిలో మా నానమ్మ కనిపిస్తోంది. ఈవిడ మాటల్లో నానమ్మే వినిపిస్తోంది.

ఇంటికి వెళ్ళాము. పిల్ల పేగు మెడకు వేసుకుని పుట్టింది. మేనమామ లేడు కాబట్టి, నూనెలో మొహం చూపించే పనిలేదు. కాకపోతే చిన్న శాంతి పడింది.  అత్తగారు తూతూ మంత్రంగా తంతు జరిపించేశారు.

ఒకరోజు రమక్క దగ్గర్నుంచి ఫోను వచ్చింది. అమెరికాలో ఉన్న కూతురికి పురుడు వచ్చే రోజులుట. సహాయంకోసం తను వెళ్ళేతీరాలిట.  అమ్మ ఇక్కడే ఉంది కాబట్టి, నాన్నని కూడా తీసుకొచ్చి దింపుతానని చెప్పింది.

నిజానికి "వెంటనే తీసుకొచ్చి దింపు, నన్నడగాలా?"  అని బాధ్యతగా అనాల్సిన సమయంలో నా నోరు పెగల్లేదు.

అత్తగారు ఏమంటారో.. ఆయన ఏమంటారో?   వాళ్ళకి చెప్పి మళ్లీ ఫోన్ చేస్తానన్నాను.  ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం వలనో, పుట్టింటి అండ లేకపోవడం వలనో.. నేను పిరికిగా తయారయ్యాను.  నిర్ణయాలు తీసుకోలేని నిస్సహాయురాలిగా ఉండిపోయాను.

మావారే చొరవ చేసి వాళ్ళ అమ్మకు నచ్చచెప్పబోయారు. ఆవిడ ఒప్పుకోలేదు! చేసేది లేక, రమక్క ఓ రోజు నాన్నను తీసుకొచ్చి మా ఇంట్లో దింపి వెళ్ళింది. మా నాన్న వచ్చిన దగ్గర్నుంచీ అత్తగారికి చిరాకులు ఎక్కువయ్యాయి. దానికి కారణం లేకపోలేదు. నలుగురు ఆడపిల్లలున్న ఓ పేద బడిపంతులి కూతుర్ని చేసుకుంటానని మావారు అన్నప్పుడు ఆవిడ ఒప్పుకోలేదు.

"లక్షణంగా మంచి సంబంధాలు వస్తుంటేనూ! ఆ ఆడ సంతానం నీకెక్కడ తగిలిందిరా? అదీకాక బతుకు కోరే బావమారిదన్నా లేడు. నా తర్వాత నిన్ను చూసుకునే అత్తింటి ఆశ నీకెవన్నా ఉంటుందా? అదీకాక ఒకే ఈతలో నాలుగు పిల్లి పిల్లల్లా అందరూ ఆడ సంతానమే. నీ పెళ్లానికీ అదే పోలిక వస్తే.. వంశం దుంపనాశనం అవుతుంది. నేచెప్పాల్సింది చెప్పాను, వింటే బాగుపడతావు!" అంటూ ఎన్ని హితోపదేశాలు చేసినా ఆయన వినలేదు. ఆయన స్నేహితులది మా పక్కిల్లే. వచ్చిపోతూ ఉండేవారు. పేదింటి పిల్లనైనా, పద్ధతిగా నిదానస్థురాలినని నన్ను కోరి పెళ్లిచేసుకున్నారు. ఆయన నాకు ఏ లోటూ రానీయలేదు.

"ఒరేయ్ రాఘువా! నాకు మనశ్శాంతి కావాలిరా! నేను మీ అక్క దగ్గరకి వెళ్లిపోతున్నాను. ఎప్పుడొస్తావు అని అడక్కు! నా అల్లుడూ కూతురూ నన్ను కాలు కందకుండా చూసుకుంటారు! ఈ సంత నేను భరించలేనురా.. ఇల్లు ఖాళీ అయినప్పుడు ఫోన్ చెయ్యి. అప్పుడొస్తాను!" అని మావారితో చెప్పి అత్తగారు కూతురు దగ్గరకు బెంగుళూరు వెళ్లిపోయారు.

"ఆవిడకి నా మీద ఎందుకంత కోపం? అయినా ఆడపిల్ల పుట్టటం నా తప్పా? అమ్మా, నాన్నను నా దగ్గర ఉంచుకోవడం నేరమా? కూతురికి కూడా బాధ్యత ఉందని ఎందుకు గుర్తించరు?" మా వారితో చెప్పుకుని బాధ పడ్డాను.

మా నాన్నలాగే ఈయనా మౌనంగా విని ఊరుకున్నారు. విసుక్కుంటూ వెళ్లిన అత్తగారు పది రోజులు తిరక్కుండానే వచ్చేశారు. రావటమే కాకుండా.. మనవరాలిని ఎత్తుకుని ముద్దులాడుతున్నారు. అమ్మా నాన్నను కూడా నవ్వుతూ పలకరించారు. ఈ సంతోషాన్ని పంచుకోవటానికి మా వారి దగ్గరకు పరిగెత్తాను. గది లోంచి అత్తగారి మాటలు వినబడుతుంటే అక్కడే ఆగిపోయాను.

"నాకు జరిగిన అవమానానికి జన్మలో ఆ గడప ఇక తొక్కనని శపథం చేసి వచ్చేసానురా!" అత్తగారు మాటలు వినబడ్డాయి.

"బావగారు ఏమన్నా అన్నారా నిన్ను? అక్కకి ఫోన్ చేసి నేను కనుక్కోనా?" అన్నారు మా వారు.

"బావగారు అనటం కాదురా.. నేను వినడం లేదనుకుని, స్వయంగా మీ అక్కే మీ బావ దగ్గర నన్ను నానా మాటలూ అన్నది. మీ బావ 'మా అమ్మని ఇంటికి రానివ్వద్దన్నావు. అడుగుపెడితే వెళ్లిపోయేదాకా కాల్చుకుని తింటావు. ముసలి వాసనే గిట్టదంటావు. అట్లాంటిది మీ అమ్మను పిలిపించుకుని ఇక్కడే ఉంచుకుంటానంటే చెప్పు... నేను మా అమ్మను కూడా పిలిపిస్తాను!' అన్నారు. అందుకు మీ అక్కేమందో తెలుసా...'మా అమ్మకి ఒకచోట కాలు నిలవక ఇక్కడికి వచ్చిపడింది. మా వదిన దేవతలా చూసుకుంటుంటే ఈవిడకి తీపరం. మా తమ్ముడో చవట. మా అమ్మ ఆడించినట్టల్లా ఆడతాడు, వంతపాడతాడు..! నేనట్టాకాదు. నాలుగు రోజులు చూస్తాను. కదిలిందా సరేసరి, లేకపోతే పొగపెట్టి సాగనంపుతా' అంది! 'అవును నీకు పొమ్మనకుండా పొగపెట్టటం వెన్నతో పెట్టిన విద్యేగా! పొగపెట్టి మా అమ్మని వెళ్లగొట్టినా, నోరు మెదపలేని నేనో చవటని!' అంటూ విసుక్కుంటూ వెళ్ళిపోయాడు మీ బావ.

ఇక చూసుకో నాయనా, మీ అక్క చిద్విలాసాలు అన్నీ ఇన్నీ కావు. పొద్దున్నే లేవదు. కాఫీకి పాలు ఉంచదు.. ఏదన్నా చేసుకుని తిందామంటే.. అలమారాలకు తాళాలు వేసేసింది! తోచక ఏదో పని చేద్దామంటే 'నీ కోడలు ఇంటి పనులన్నీ చేసి నిన్ను బద్ధకస్తురాలిని చేసిందే అమ్మా! చేతా వాతా కాని పనులకు నువ్వు అడ్డం రాకు, అట్లా ఓ మూల కూర్చో. వంట అయ్యాక పిలుస్తాను, తిందువుగాని!' అంటూ ఎంత బడాయి పోయిందిరా..! దాన్ని ఎంత గారాబంగా పెంచానురా. దానికి నామీద తల్లినన్న ప్రేమా లేదు, గౌరవం లేదు. తల్లిదండ్రుల మీద ప్రేమ, అత్త గారంటే గౌరవం, భర్త మాటంటే లక్ష్యం ఉన్న లక్షణమైన పిల్లరా మన వసుధ. పేరుకు తగ్గట్టే సహన మూర్తి! పెంపకంలో ఉంటుంది నాయనా. ఆడా మగా అని కాదు!!"

అత్తగారు నన్ను పొగుడుతూ ఆయనతో అంటున్న మాటలు గది బయట నిలబడ్డ నా చెవిన పడ్డాయి. నాకు చెప్పలేనంత సంతోషంగా అనిపించింది. అత్తగారు అర్థం చేసుకున్నారు అంతే చాలు అనుకున్నాను. ఆ రోజు సాయంత్రం బాల్కనీలో కూర్చున్న మా వారికి కాఫీ ఇద్దామని వెళ్ళాను.

"థాంక్స్ బావగారూ, థాంక్సే అక్కా..నేను చెప్పినట్టే మాట్లాడారు! అమ్మ అంతా చెప్పింది, ఆవిడకి మెల్లిగా నేను నచ్చచెపుతాలెండి, మీరు ఫీల్ అవకండి...! అమ్మ వాస్తవాన్ని గ్రహించేలా చేశారు. మీ ఇద్దరి తెలివికి జోహార్లు! వసుధ మీద ఇప్పుడు అమ్మకు కోపం లేదు. మనవరాలిని కూడా ఎంత ముద్దు చేస్తోందో తెలుసా! వచ్చిన దగ్గర్నుంచీ ఎత్తుకుని దింపటం లేదు!" మా వారి మాటలు చల్లని సమీరాల్లా నా మనసును తాకుతూంటే అప్రయత్నంగా కళ్ళు ఆనందంతో వర్షించాయి. 'అంతరంగాన్ని ఎరిగి వరాలిచ్చే భోళాశంకరుడు!' అనుకుంటూ కాస్త వెనక్కి వెళ్లి మెల్లగా దగ్గాను. ఆయన ఫోన్ ఆపేసి నా వైపు చూసారు. చలువ చంద్రుడిలా..!!

**0**

## రెండవ బహుమతి

# విధి విలాసం

### మేడా మస్తాన్ రెడ్డి





# విధి విలాసం

**మేడా మస్తాన్ రెడ్డి**

**కాం**చన ఉలుకూ పలుకూ లేకుండా ఎంతసేపటి నుండి ఉండిపోయిందో తనకే తెలియదు. నాగభూషణం తీరు ఆమెకు అర్థం కావడం లేదు. ఇప్పుడే కాదు, తనకు ఊహ తెలిసినప్పటి నుండి ... ఇదిగో ఇప్పుడు ఈ పెళ్లి సమయం వచ్చేవరకూ కూడా.

తాను అప్పుడు నాలుగో తరగతి కాబోలు చదువుతోంది. తమ ఇంటికి వచ్చాడు నాగభూషణం. వస్తూనే తనను దగ్గరకు తీసుకుని ముద్దులాడాడు. రబ్బరు బొమ్మను తడిమినట్టు తన శరీరమంతా తడిమాడు. ఆ సమయంలో తన ప్రక్కనే అమ్మా నాన్నా ఉన్నారు. వాళ్ళూ అభ్యంతరం చెప్పడం లేదు. తోలు బొమ్మలాట లాగ చూస్తున్నారు.

'కాంచనకు ఏ లోటూ రాకూడదు' అన్నాడు నాగభూషణం. కొంత డబ్బు ఇస్తూ. డబ్బు అందుకుంటూ అమ్మ ఆనందంగా తల పైకి కిందకు ఊపడం తనకు బాగా గుర్తుంది.

తనకు పదమూడేళ్ళు వయసు వస్తున్నప్పుడే తమ కుటుంబం మరింత దారిద్ర్యంలో కూరుకుపోతున్న సంగతి అర్థమవుతూ వచ్చింది. అయినప్పటికీ తనకెలాంటి లోటు జరిగేది కాదు. అమ్మకు అయిదారు సిల్కు చీరలు మాత్రమే ఉండేవి. నాన్నకూ మంచి బట్టలు ఉండేవి కావు.

తనకు మాత్రం విడిగా పెట్టె నిండా ఖరీదైన దుస్తులుండేవి. పుట్టినరోజులకు కనీసం రెండు జతలు అమరేవి. ఖరీదైన చెప్పులు, రిబ్బనులు, చెవులకు బంగారు దుద్దులు, మెడలో గొలుసు. తన ఈ ఆహార్యం చూసి తనను స్కూల్లో గొప్పింటి బిడ్డననుకునేవాళ్ళు.

ఇవన్నీ తనకు ఇలా ఎలా సమకూరేవో అర్థమయ్యేది కాదు. చివరికి లంచ్ బాక్స్, పుస్తకాల బ్యాగ్ కూడా కాస్త ఖరీదువే ఉండేవి.

ఏదో ఒక వంకతో నాగభూషణం తమ ఇంటికి తరచుగా వచ్చేవాడు. అమ్మ నాన్నలకు డబ్బులు, తనకు ముద్దులు తప్పనిసరిగా ఇచ్చేవాడు. తన ప్రతి పుట్టినరోజుకూ ఏదో ఒక కానుక ఇచ్చేవాడు. తనకు ఆయన పొడగిట్టేది కాదు. తన బుగ్గలు చిదమడంలో ఆయన తృప్తి పడేవారు కాదల్లే ఉంది. తనను బాగా దగ్గరకు తీసుకునేవాడు. ఆయన కౌగిటిలో తనకసలు ఊపిరి సలిపేది కాదు. అతని నోటి సిగరెట్ వాసన అసలు పడేది కాదు.

'మగవాడికి ఒళ్ళంతా కామమే. నెలల వయస్సున్న ఆడపిల్ల కూడా వాడికి భోగ వస్తువే! ఉచ్చ నీచాలు మరచిపోతుంది మగ జాతి. ఆడవాళ్ళం మనమే స్పృహలో జాగరూకతతో ఉండాలి. మీ వద్ద ఎప్పుడూ పెప్పర్ స్ప్రే గానీ, చిన్న చాకు గానీ, కనీసం ఒక పిన్నీసు అయినా ఉంచుకోవడం మంచిది' అనేది సైన్స్ టీచర్ సావిత్రి పదో తరగతిలో.

నాగభూషణం చర్యల వెనుక అంతరార్థం ఆమె చెప్పే వరకూ తనకు అర్థమైంది కాదు. వయో భేదాలతో నిమిత్తం లేకుండా మగాళ్ళు ఇంతటి దురుద్దేశ్యంతో ఆడపిల్లలను తాకుతారా అన్న సంగతి పూర్తిగా అవగతమైంది.

టీచర్ చెప్పిన తర్వాత నాగభూషణం మీద వెగటు భావన మరింత పెరిగింది. ఎదిగిన ఆడపిల్ల అని చూడకుండా అంత సాన్నిహిత్యంతో దగ్గరకు లాక్కుంటాడేం! అన్నింటికంటే ఘోరం, అమ్మ నాన్న కూడా ఆయన నుండి డబ్బు తీసుకుంటూ ఆయనకే వంత పాడటం.

ఒకసారి తల్లిని అడిగింది తను నాగభూషణం ఏం చేస్తుంటాడని?

'ఒకప్పుడు నాటకాల్లో వేషాలు వేసేవాడు. ఇప్పుడు టివి సీరియల్స్‌లో సినిమాల్లో చిన్నా చితకా పాత్రలు వేస్తున్నాడు. అతనికి విశాఖపట్నం రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న గణేశ్ లాడ్జిలో వాటా కూడా ఉంది' చెప్పింది అమ్మ.

'నన్ను ఆయన అలా దగ్గరకు తీసుకోవడం నాకూ చాలా అసహ్యంగానూ ఎబ్బెట్టుగానూ ఉంటుంది. ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకినట్టుంటుంది. ఇన్నేళ్ళు భరిస్తూ వస్తున్నాను' అంది తాను ఒకసారి.

'తప్పు తల్లీ. నిన్ను అంతగా ఇష్టపడే వారిని అలా తూలనాడవచ్చునా?' తల్లి కూడా వత్తాసుతో పాటు 'ఆయన దాదాపు నా ఈడు వారు' అన్నాడు తండ్రి.

తన డిగ్రీ మూడో యేడు చివరలోనే పెళ్లి సంబంధం వచ్చింది. అబ్బాయి ఒక ప్రయివేటు కంపెనీలో అకౌంటెంటు. చెడు అలవాట్లు లేవట. అక్కచెల్లెళ్లు లేరు. తల్లి ఈ మధ్యనే పోయారట. అతడి తండ్రి డిప్యూటీ తాసిల్దారు. సొంత ఇల్లు. కట్నం తీసుకోవడం ఇష్టం లేదట. అత్తా ఆడపడుచుల ఆరళ్ళు లేని సంబంధం అని చెపుతున్నారు.

'ఈ సంబంధం మనకు ఎలా వచ్చిందమ్మా! అడిగింది తాను. 'నాగభూషణంగారే ఈ వరుడుని వెతికి తెచ్చారు' బదులిచ్చింది అమ్మ.

తన సందేహం మరింత బలపడుతుందే తప్ప బలహీనపడటం లేదు. తమ పెళ్ళి జరిగిన తర్వాత కూడా ఆయన తమ ఇంటికి రాకపోకలు సుగమం చేసుకుంటున్నాడు. ఇక తన భర్త అట్టే సందేహించడు.

ఇంకా ఆలస్యం చేస్తే భవిష్యత్తులో జరగబోయే అనర్థాన్ని ఆపలేనేమోనని తల్లిదండ్రుల ఎదుట తన అనుమానం కక్కింది. తనను చెడామడా తిట్టింది తల్లి... కొట్టబోయింది కూడానూ!

పెళ్లిచూపులు ఏర్పాటు చేయడానికి ఈ సంఘటన అడ్డు కాలేదు. అయితే తనకు అర్థం కానిదొకటే ఎదిగిన ఆడపిల్లగా తానెటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎంతటి అప్రమత్తతతో ఉండాలో సుద్దులు శ్రద్ధగా చెప్పిన సావిత్రి మేడమ్ కూడా వరుడి బంధువులతో పాటు తమ ఇంటికి రావడం.

'మేడమ్!' ఆశ్చర్యంగా పలకరించింది తాను.

'నాకు వరసకు మేనల్లుడే కాంచనా. నీకు కాబోయే భర్త. మీ ఇంటికేనని ఇక్కడకు వచ్చేంత వరకూ నాకూ తెలియదు' అంది టీచర్.

వార్ధక్యం తొలి దశకే మేడమ్ బాగా లొంగిపోయారు. పాపం! ప్రేమ వివాహం చేసుకుని ఆమె నష్టపోయారట. భర్తకు అంతకుముందే పెళ్ళయిన సంగతి తెలియదట. పిల్లలూ ఉన్నారట. అయినా ఆమెను ప్రేమ పేరుతో బురిడీ కొట్టించి మాయ మాటలు చెప్పి రెండో పెళ్ళి రహస్యంగా చేసుకున్నాడట. నిజం తెలిసి నిలదీసేటప్పటికి 'నీ మానాన నువ్వు బ్రతుకు' అని పురుషాహంకారంతో చేయి చేసుకున్నాడట.

టీచర్ అప్పుడు చెప్పినవి ఇప్పుడు గుర్తుకొస్తున్నాయి కాంచనకు.

"ఇంకా అలాగే కూర్చున్నావేం?" తల్లి పిలుపుతో ఆలోచనల్లోంచి బయటపడింది కాంచన.

"పండ్లూ, పూలు, స్వీట్స్ వగైరా వచ్చేసాయి. నాగభూషణంగారే ఏర్పాటు చేసారు!" కాంచనను తండ్రి సమీపించాడు.

కాంచనకు అరికాలి మంట నెత్తికెక్కింది. అన్నింటికీ ఒకే పేరు తమ ఇంట్లో మార్మోగిపోతోంది. నాగభూషణం ... నాగభూషణం ... నాగభూషణం.

ఆమె చేతికి ఒక చిన్న పెట్టెను అందించాడు తండ్రి. అరచేయంత ఈ పెట్టెలో ఏదైనా ఒక నగ ఉంటుందని ఎదిగిన ఆడపిల్లకు ఎవరూ వేరే చెప్పనవసరం లేదు.

"నీకేనమ్మా ఈ హారం. నాగభూషణంగారు పెళ్ళి కానుకగా తెచ్చి ఇచ్చారు. అలంకరించుకుని మరీ పెళ్ళి చూపులకు కూర్చోమన్నారు. అయినా ఈ తతంగం పేరుకు మాత్రమే. ఆయన గీసిన గీత దాటడు వరుడు!" అన్నాడు తండ్రి.

"ఆ సంగతి తెలుసు. బాగా తెలుసు." పళ్ళు పటపటలాడించి కళ్ళు పెద్దవి చేసింది కాంచన.

కాంచన హారం చూసి తన తల్లీ తండ్రీ సంబరపడుతున్న సంగతి కాంచనకు అర్థమవుతూనే ఉంది. అంత ఖరీదైన వస్తువును చూసి ద్రిగ్భమలో ఉండిపోయారు వాళ్ళు. ఒక ప్రక్క ముందు గదిలో పెళ్ళిచూపుల బృందం కూర్చుని ఉంది. హారం ధరించిన కాంచన అక్కడకు వెళ్ళడమే మిగిలింది.

"నాగభూషణంగారు మన శ్రేయోభిలాషి, పద్దెనిమిదేళ్ళుగా మనలను ఆదుకుంటున్నాడాయన. నీ అభివృద్ధిలో ప్రతి అడుగూ ఆయన వేయించిందే." గుటకలు మింగాడు తండ్రి.

"అవును తల్లీ. మేము పిల్లలు లేక అల్లాడుతుంటే బుడిబుడి నడకల నిన్ను తీసుకొచ్చి వారే మా చేతుల్లో ఉంచారు!" అంది తల్లి.

"అయితే నేను మీ బిడ్డను కానా!" నిర్ఘాంతపోయింది కాంచన.

"మా సమస్తం నువ్వేనమ్మా!" అంది తల్లి.

"పెళ్ళికూతురు ఎంతకూ రాదేం?" అంటూ సావిత్రి టీచర్ ఆ గదిలోకి ప్రవేశించింది. కారణం తెలియదు కానీ, తొలి నుండీ ఆమెకు కాంచన పట్ల ప్రత్యేకమైన ఆదరాభిమానాలు ఏర్పడ్డాయి.

ఆమె ఒక ఆడపిల్లను కని ఏడాదిపాటు పెంచి అటు తర్వాత దూరం చేసుకుంది. బిడ్డతో పాటు ఆయన బయటకు వెళ్ళిపోయాడు - ఆమెకు ఇచ్చిన కానుకలతో పాటు.

'నిజమే. తెలిసే చేసానో, మోహించానో, నిన్ను రెండో పెళ్ళి చేసుకున్నాను. అంతే తప్ప నీకు అన్యాయం చేయలేదే. నన్ను ఇంతలేసి మాటలంటావా? ఇక నీ సుఖం నాకు అక్కర్లేదు. నా సుఖానికి నువ్వు అడ్డు రాకు. ఒంటరిగా ఉంటావో. మరో పెళ్ళి చేసుకుంటావో నీ ఇష్టం' నిష్ఠూరాలాడి వెళ్ళాడతడు.

అతణ్ణి ఆపలేదు తను. తన ఉద్యోగమే చూసుకుంటుందా? బిడ్డనే చూసుకుంటుందా? కూతురు ఎక్కడున్నా క్షేమంగా ఉంటుందని ఆశించింది. అప్పటికి మాత్రమే ప్రాణానికి హాయి అనిపించింది. తర్వాత ఒంటరి జీవితం ఎంత భారమో తెలిసొచ్చింది. మగవాడి వల్ల ఎంత మోసపోతుంది ఆడది! అతడి స్పర్శ ఎంత ప్రమాదకరం! అందుకే సావిత్రి టీచర్ పురుష ద్వేషిణిగా మారిపోయింది.

లేచి నిలబడి సావిత్రిగారిని పట్టుకుంది కాంచన. అప్పటికే కాంచన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"నేను పెంపుడు బిడ్డనట మేడమ్!" గొల్లుమంది కాంచన.

ఆమెను ఊరడించడం సావిత్రికీ, పెంచిన తల్లిదండ్రులకూ శక్తికి మించిన భారమే అయిపోయింది. ఆమెను మరపించడానికన్నట్టు నగ పెట్టెను అందుకుంది టీచర్. అది అయిదు అంగుళాల చతురస్రాకారపు పాత పెట్టె. దాని ముఖమల్ పొర కూడా రేగిపోయి ఉంది.

"ఇంత పాత పెట్టె ఎక్కడ దొరికిందమ్మా!" అంటూ మూత తెరచి "ఈ నగ నీకు ఎవరు ఇచ్చారు?" అనుమానంగా దానిని చూస్తూ అడిగింది సావిత్రి.

"విసిరెయ్యండి మేడమ్. అసలీ నాగభూషణమే ఇంత అనర్థానికి కారణం. ఆ ఆభరణం ముట్టకండి. మీరంటారే మగవాడి స్పర్శ... అదే నాగభూషణం రూపంలో నన్ను పట్టుకుంది."

పాత హారం పెట్టెను లాక్కుంది కాంచన. దానిని విసిరేయబోయింది.

ఉనికిలో ఉండి కూడా కంటికి కనిపించని రేడియో తరంగాలలాగా మానవుల భావనా తరంగాలు కూడా కావలసిన వారి చుట్టుప్రక్కల వ్యాపిస్తాయల్లే ఉంది. ఎద లోపలి మమకారాలు ఎక్కడికీ పోవేమో! వాటి గురుత్వాకర్షణ శక్తి అదృశ్యంగా అమలవుతూ ఉంటుంది.

"ఆగు" అని అరచి, "పెట్టె తెరువు పాపా!" అంది సావిత్రి పంటి బిగువున దుఃఖాన్ని ఆపుకుంటూ.

కొత్త పిలుపును పట్టించుకోలేదు కాంచన. ఆ పెట్టె తెరచింది. లోపల ఒక హారం ఉంది. కంసాలి చేసిన పాతకాలం నాటి నగ అది. యంత్రం మీద నగిషీలు చెక్కింది కాదు. అయితే ఇటీవలే మెరుగు పెట్టించారల్లే ఉంది.

"హారం వెనుక లాకెట్‌కి కుడి ప్రక్క పేరు ఉంటుంది. చూడు." సావిత్రి కంఠం జీరబోయింది.

కాంచన చదివింది.

"సావిత్రి నాగభూషణం!"

వణుకుతున్న చేతులతో ఆప్యాయంగా కాంచనను దగ్గరకు తీసుకుంది సావిత్రి. కాంచన కళ్ళు మాత్రం అయోమయంగా నాగభూషణం రాకకోసం మొదటిసారి ఆత్రంగా ఎదురుచూస్తున్నాయి.

**O**

కథా మంజరి

## మూడవ బహుమతి

# రామ బాణం

భాగవతుల కృష్ణారావు





# రామబాణం

## భాగవతుల కృష్ణారావు

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. కమల ఇంటి ముందు సంశయంగా నిల్చుంది. తలుపు కొట్టడానికి రెండుసార్లు ప్రయత్నించింది. చెయ్యి సహకరించటం లేదు. ఏదో తెలియని భయం ఆవరిస్తోంది. 'ఏం చెయ్యాలా?' అని ఆలోచిస్తూ, ఓ అడుగు వెనక్కి వేసిన ఆ పద్దెనిమిది సంవత్సరాల మనసులో, చిన్నప్పుడు బామ్మ చెప్పిన రాముడి కథ మెదిలింది.

వనవాస సమయంలో రాముడు ఒకసారి విశ్రాంతి తీసుకుంటూ, ధనుర్బాణాలు పక్కన పెడుతూ, చేతిలో వున్న బాణాన్ని నేలమీద గుచ్చాడట. కాస్సేపటికి, బాణం ములికి దగ్గర రక్తాన్ని గమనించి, తన బాణపు ములికి, కప్పను గాయపరిచిందని తెలుసుకుంటాడు. దానికి స్వస్థతనిచ్చి, అరచి తన ఉనికిని చాటనందుకు మందలిస్తాడు.

అప్పుడా కప్ప "రామా! సర్వ లోక జగద్రక్షకుడివి. ఎవరికే ఆపద కలిగినా నిన్నే స్మరిస్తారు. మరి నీ వల్లే ఆపద కలిగితే ఎవరిని వేడుకోవాలి? అందుకే మిన్నకున్నాను" అందట.

కొంచెం ధైర్యం వచ్చి, వెనక్కి వేసిన అడుగు తిరిగి ముందుకు వేసింది! తన ఇంటి ముందే నిలబడ్డ కమల, గుమ్మం వైపు చూస్తోంది. భయం పూర్తిగా పోలేదు!

సరిగ్గా నెల కిందట, ఎవరికీ చెప్పకుండా తాను ఆ ఇంట్లో నుంచి వచ్చేసింది. అప్పుడు తాను తప్పు చేస్తున్నట్లు అనిపించలేదు.

ఇప్పుడు తనని ఇంట్లోకి రానిస్తారా?

ఇంట్లో వాళ్ల సంగతి తనకి బాగా తెలుసు. నాన్న దూర్వాసుల్లా మండి పడతాడు. నోరు లేని అమ్మ, తనని కాపాడే ప్రయత్నం చేస్తుందనే నమ్మకం కూడా లేదు. చేసినా, ఆవిడ మాట చెల్లదు. అన్నయ్యకి స్వతంత్రం లేదు. మామ్మ ఒక్కతే చేస్తే యేమయినా చెయ్యగలదు.

కానీ దుర్వాసుడు లాంటి కొడుక్కి అడ్డు చెప్పగలదా!

నిజమే! తను చేసింది మహా ఘోరం. క్షమార్హం కాదు! ఈ మాట పవిత్రమైన కుటుంబంలో పుట్టి, ఊరూ పేరూ లేని వాడితో చెడ తిరిగి, నెల్లాళ్ల తర్వాత వాడు మోజు తీర్చుకున్నాక వదిలేస్తే, దిక్కులేక నానా ఇబ్బందులు పడి తిరిగి ఇంటికి వచ్చింది.

కాని..తనకు ఆశ్రయం లభిస్తుందా! ఇంటి వాళ్లు తనని చేరదీసి అక్కున చేర్చుకుంటారా! అలా జరగని పరిస్థితుల్లో తనేం చెయ్యాలి? కమల ఆలోచనలు ఎటో వెళ్తున్నాయి.

సరిగ్గా నెల కిందట..

తన యింటి ముందు జరుగుతున్న నిర్మాణం పనిలో చలాకీగా పనిచేసే హసన్ తనని ఆకర్షించాడు. ఇంటర్ చదువుతున్న తను అర్థంకాని వ్యామోహంలో పడిపోయింది. రోజు స్కూల్ కి వెళుతున్నప్పుడు, వస్తున్నప్పుడు, చూపులు, నవ్వులతో మొదలై, దొంగతనంగా కలుసుకోవడం, ముక్కు మొహం తెలియని వాడితో యిల్లు వదిలి పారిపోవడం వరకు సాగిపోయాయి. తనకి మరో ఆలోచన రాలేదు. ఇంట్లో పరిస్థితులు, ఇంట్లో వారు .. ఇలా ఏది గుర్తుకు రాలేదు. అంతే... అతని మాటలు నమ్మి, మరో ఊరు వెళ్ళిపోయింది అతనితో! మోజు తీరాక అతని అసలు రంగు బయట పడింది.

రెండ్రోజుల క్రితం, తెల్లవారు జామున తనకి తెలివొచ్చి చూసేసరికి, పక్కన అతడు లేడు. అతను పని చేసే అన్ని చోట్ల వెతికింది. ఎక్కడా ఆచూకి తెలియలేదు. అప్పటికే ఆ ఇరుకుల సందు ఇళ్లల్లో వాళ్ల చూపులు తనని భయ పెట్టాయి. ఇక అక్కడ ఉండడానికి భయం వేసి బయటపడింది. అప్పుడే తిరిగి ఇంటికి వెళ్ళి పోవాలనే ఆలోచనే వచ్చింది. ఇంట్లో వాళ్ళు ఏఁవన్నా సరే.. తనకి మరో గత్యంతరం లేదు.

ఇన్ని రోజులు.. సినిమాలా గిర్రున తిరిగిపోయాయి.

తీరా.. ఇప్పుడు యింటి దగ్గరకు చేరాక, భయం తనని ఆవహించింది! ఎలా? ఎం చెయ్యాలి?

ధైర్యాన్ని కూడగట్టుకుని తలుపు కొట్టింది. అప్పటికే ఇంట్లో వాళ్ళు లేచి, కాలకృత్యాలు తీర్చుకునే పనిలో ఉన్నట్టు అనిపించింది.

'ఎవరూ?' అంటూ తలుపు తెరుచుకున్నాయి... ఎదురుగా తండ్రి!
కమల తల దించుకుని నిలబడింది.

ఆమెని చూస్తూనే శివమెత్తిన వాడిలా అరిచాడు. తల్లి వంటింటి పొగల్లోంచి గబగబా బయటకొచ్చింది. నాన్న పక్కనే నిలబడిపోయింది. కళ్ళల్లో ఉబికి వచ్చిన కన్నీళ్లు, తన అశక్తత చూపకనే చూపెడుతున్నాయి. అన్నయ్య కిటికీ వూచల్లోంచి జాలిగా చూస్తునాడు. అక్కలిద్దరు భయంగా చూస్తునారు. మామ్మ నెత్తి మీద ముసుగు లాక్కుంటూ తండ్రిని సముదాయిస్తోంది.

అయిపోయింది... తనకిక ఇంట్లో స్థానం లేదు! తను చేసిన తప్పు చిన్నది కాదు. తండ్రి కేకల్ని తను తప్పు పట్టలేదు. ఏ తండ్రైనా అలాగే చేస్తాడు. తనకీ వాళ్లకీ నేటితో రుణం తీరిపోయినట్టే! ఉన్న ఒక్క ఆశా అడుగంటి పోయింది. తీసిన తలుపుల్ని ఒక్క ఉదుటున మూసేసాడు!

ఇక తన దోవ తను చూసుకోవాల్సిందే.

కాస్సేపాగి, కళ్లు తుడుచుకుని అనంత అంధకార లోకాల్లోకి సాగిపోయింది కమల.

ఎక్కడుందో! ఇప్పుడేం చేస్తోందో! కాలం కదిలిపోతోంది నెలలుగా.. సంవత్సరాలుగా!

కమల నాన్న, మామ్మ గతించారు. తల్లి రాని కూతురు కోసం మంచం పట్టేసింది. అక్కలు వాళ్ల కాపురాలు వాళ్లు చేసుకుంటూ వున్నారు. కమల ఏమైందో? ఏ నిప్పుల లోకాల్లో, గ్రీష్మారణ్యాల్లో దారి తప్పి తిరుగుతోందో? ఏ రాక్షసుల కబంధ హస్తాలలో చిక్కుకుందో! స్వచ్ఛమైన లోకం పోకడ తెలియని పావురం లాంటి పిల్లని ఏ ఇనప డేగలు కబళించాయో... లేక.. ఏ అంధకార కూపాలో, రైలు పట్టాలు తమలో కలిపేసుకున్నాయో..? ఎవరికి తెలుసు..ఎవరు చెప్పగలరు? ఎక్కడుందో!! ఏం చేస్తోందో!!

***

ఇరవై సంవత్సరాలు గడిచాయి.

కమల వాళ్ల అన్నయ్య కమలాకర్ ఆ రోజు ఆఫీసు పని మీద కలకత్తా వెళుతుంటే ఎందుకో అతనికి చెల్లెలు గుర్తుకు వచ్చింది!

అతనికి పెళ్లయింది. మిగిలిన చెల్లెళ్ళు పెళ్లిళ్లు అయ్యాక తను చేసుకున్నాడు. అందరూ హాయిగా వున్నారు. కమల తప్ప. తను కమల ఆచూకీ కోసం చెయ్యని ప్రయత్నం లేదు. కానీ ఆమె కనపడలేదు. ఆ రోజు కమల దైన్య వదనం, కళ్లకి కట్టినట్టు ఈనాటికీ కనపడుతోంది. గతం కళ్ల ముందు కదలగానే... వెచ్చటి కన్నీటి చుక్కలు చెంప మీదకు జారేయి.

ఆఫీసు పని ముగించుకుని, దగ్గరలోనే ఉన్న గెస్టు హౌస్ కి నడిచి వెళ్తున్న అతని కళ్ళు, తన ముందు గబగబ నడుస్తున్న ఆమె మీద పడ్డాయి. అరే.. తన చెల్లెలు కమల్లా ఉందే! అంతలోనే అమె అక్కడే ఉన్న ఆటో ఎక్కేసింది. అప్పుడు ఆమె మొహం కనబడింది.. ఆమె కమలే! అంతే అక్కడే ఉన్న మరో ఆటో ఎక్కి, ఆ ఆటో వెంట వెళ్లమని చెప్పాడు. 'వాళ్లు ఎక్కడుంటారో తెలుసులెండి' అన్నట్టు ఓ నవ్వు నవ్వి ఆటో పోనిచ్చాడు. ఓ పది నిమిషాల్లో ఆటో సందుల్లో తిరిగి, తిరిగి ఓ ఇంటి ముందు ఆగింది. "ఇక్కడే సార్ వాళ్ళు ఉంటారు!" అంటూ ఆటో ఆపాడు.

ఆటో దిగిన అతడు ఎక్కడికొచ్చాడో అర్థం అయి షాక్ కు గురయ్యాడు.

కలకత్తాలోని ప్రఖ్యాత వేశ్యావాటిక సోనాగచి!

సందులు .. గొందులు .. వాహనాలు .. త్రాగుబోతులు, తిరుగుబోతులు .. దేహ వ్యాపారులు .. నరకానికి ప్రతిరూపంలా ఉందక్కడి వాతావరణం!

ఒళ్ళంతా కళ్లు చేసుకుని చూస్తూ నడుస్తున్నవాడల్లా... హఠాత్తుగా ఆగిపోయాడు. కుడి వైపు మేడమీద ఆ తెల్ల పిల్ల.. కమల లాగే వుంది. ఆమె కూడా ఇటే చూసి, గిరుక్కున వెనుతిరిగింది! కమలే .. తను గుర్తుపట్టేడు. బహుశా కమల కూడా గుర్తు పట్టే వుంటుంది. అందుకే తనని చూడగానే గభాలున వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

చెల్లెలు కనపడినందుకు సంతోషించాలో, ఇలాంటి పరిస్థితులలో ఉన్నందుకు బాధపడాలో అర్థం కాని అనిర్వచనీయమైన స్థితిలో వున్నాడు.


అదే సమయంలో చిన్నప్పుడు తమందరినీ చుట్టూ కూచోబెట్టుకుని రామాయణంలో కథలు చెప్పే బామ్మ గుర్తొచ్చింది. అందులో రాముని బాణం గుచ్చుకున్న కప్ప కథ గుర్తుకు వచ్చింది.
ఒక్క ఉదుటున ఆ ఇంట్లోకి అడుగుపెట్టాడు. లోపల్నుంచి ఓ ఇద్దరు ఎదురు వస్తూ.. ఏవేవో ప్రశ్నలు అడిగారు.

కమల తనని పోలిక పడితే, అక్కడ అడుగు పెట్టినందుకు అసహ్య పడుతుంది. తను ఎందుకు వచ్చాడో ఆమె వేరేలా అనుకుంటుంది. పోనీ ఆమెని బలవంతంగా చెయ్యి పట్టుకుని లాక్కుపోవడానికి తనొక్కడి వలన జరిగే పని కాదు. అక్కడ కాపలాగా కనీ కనబడకుండా ఓ పదిమంది రౌడీలు ఆ ఇరుకు సందులో పచార్లు చేస్తున్నారు.

అప్పటి వరకు చెల్లెల్ని చూసిన ఆనందంలో, తన ఉనికినే మర్చిపోయిన అతనికి, షడన్ గా తానో అసిస్టెంటు కమిషనర్ ఆఫ్ పోలీసు ఆఫీసర్ గా ఓ కేసు పరిశోధన కోసం కలకత్తా వచ్చిన విషయం జ్ఞాపకం వచ్చింది.
చెల్లెల్ని ఎలాగైనా ఆ పాప కూపం నుండి విడిపించాలన్న కృత నిశ్చయంతో లాల్ బజార్ పోలీస్ స్టేషన్ వైపు నడిచాడు కమల అన్న కమలాకర్!

**O**

కథా మంజరి




# సు జలాం సు ఫలాం

బుద్ధవరపు కామేశ్వరరావు

"ఏరా సత్యం! ఈ శీనుగాడి పనితనం ఎలా ఉంది ? మనకు ఉపయోగపడేలా ట్రైనింగ్ ఇచ్చావా?" అడిగారు కాంట్రాక్టరు రెడ్డి గారు, డ్రైవింగ్ సీట్లో ఉన్న సత్యాన్ని, క్లీనర్ శీను గురించి.

"చేరి రెండేళ్లయ్యింది గదా అయ్యా, బాగానే పికప్ అయ్యాడు! మన పద్ధతులు అన్నీ బాగానే వంట పట్టించుకున్నాడయ్యా!" మెచ్చుకోలుగా చెప్పాడు సత్యం.

"ఒరే శీనూ, జాగ్రత్తగా అన్నీ నేర్చుకో, మరి కొద్ది రోజుల్లో నిన్ను డ్రైవర్ ను చేసేస్తా!" భుజం మీద తడుతూ చెప్పారు రెడ్డిగారు, నీళ్ళ టాంకర్ డోర్ వద్ద కూర్చుని డ్రైవర్ కు రైట్ రైట్ అంటూ సూచనలు ఇస్తున్న క్లీనర్ శీనుగాడితో.

"అలాగే అయ్యా, అంతా తమరి దయ!" అంటూ వినమ్రంగా చెప్పాడు శీను.

***

సు'జలా'రెడ్డిగారు అంటే తెలియని వారు ఆ మూడు జిల్లాల్లో ఎవరూ ఉండరనడం అతిశయోక్తి కాదు. ఎప్పుడో పది సంవత్సరాల క్రితం సుజల వాటర్ ట్రాన్స్‌పోర్టు తో రెండు వాటర్ టేంకర్లతో వ్యాపారం ప్రారంభించిన వెంకటరెడ్డి గారు, అనతికాలంలోనే వాటి సంఖ్య ఇరవైకి పెంచి, వాటికి తోడుగా ఓ నాలుగు పెట్రోలు టేంకర్లు, రెండు బస్సులను కూడా చేర్చి తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు.

సాధారణ పోలీసు దగ్గర నుంచి పెద్ద పెద్ద పొలిటీషియన్ల వరకూ అందరూ కూడా రెడ్డి గారి కనుసన్నల్లో ఉండవలసిందే. దానికి నిదర్శనమే, ఇన్ని సంవత్సరాలైనా ఆయన మీద కానీ, వాహనాల మీద కానీ ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం!

ప్రస్తుతం..  వేసవి కాలంలో గోదావరి నది నుంచి ఆ జిల్లాల్లోని పరిశ్రమలకు నీళ్ళు టేంకర్లు ద్వారా సరఫరా చేసే కాంట్రాక్టు తీసుకున్నారు రెడ్డిగారు.

తన దగ్గర పనిచేసే వారిని సొంతవారిగా చూసుకుంటారు రెడ్డిగారు. వారిని ఉత్సాహపరిచేందుకే ఇలా మధ్య మధ్యలో వారితో పాటు లారీలో ప్రయాణం చేస్తుంటారు.

***

ఏదో ఆలోచిస్తున్న రెడ్డిగారు, సడన్ బ్రేక్ వేయడంతో ముందుకు పడబోయి నిలదొక్కుకున్నారు.

"ఏరా, సత్తిగా? ఏమయ్యింది ?"

"అయ్యా! ఎవత్తో ముసల్ది బండి కింద పడింది"

"ఓరి దరిద్రుడా! ఎంత పని చేసావ్? ముందు కిందకి దిగి ఏం జరిగిందో చూసి తగలడండి!" అంటూ రంకెలేసారు.

అప్పటికే చుట్టుపక్కల జనం వెనక చక్రం కింద పడి చనిపోయిన ఆ ముసలావిడ శవం వద్ద చేరి, ఆవిడ గురించి చర్చించుకుంటున్నారు.

"అదిగో డ్రైవర్ దిగుతున్నాడు, కొట్టండి దొంగ వెధవని" బూతులు తిడుతూ అతని మీదకు దూసుకొచ్చారు అక్కడ చేరిన జనం.

ఈ హడావుడి చూసిన రెడ్డిగారికి లారీ దిగక తప్పలేదు. ఆయనను చూసిన జనం కొంచెం దూరం జరిగారు.

"ఏమయ్యా, ఈ బామ్మగారి తాలూకు మనుషులు ఎవరైనా ఉన్నారా?" అడిగారు రెడ్డి గారు.

ఓ పెద్దాయన ముందుకొచ్చి, "ఎవరూ లేరు బాబూ! ఈ మధ్యనే మా ఊర్లోకి వచ్చింది. ఎవరూ లేని అనాధ అనుకుంటా బాబూ!" చెప్పాడు.

వెంటనే రెడ్డి గారు సత్యానికి సైగ చేసారు. ఆ సైగకు అర్ధం తెలిసిన సత్యం,

"ఒరే, శీనూ, ఈ ముసలామె అచ్చు మతి చెడి, మీ ఇంట్లోంచి వెళ్లిపోయిన మీ అమ్మమ్మలా లేదూ?"  అంటూ శీను భుజం తడుతూ అడిగాడు.

తెప్పరిల్లిన శీను, ఓ సారి ఆమె దగ్గరకు వెళ్ళి, పరకాయించి చూసి...

"ఔను, మా అమ్మమ్మే! ఎంత పనిచేసావు అమ్మమ్మా, రెండు సంవత్సరాలుగా నీ కోసం వెతుకుతున్నాం. ఆఖరికి ఇలా కనపడ్డావా?" అంటూ ఆమె మీద పడి భోరున విలపించసాగేడు.

"చూసేరా .. భగవంతుని లీల! అనాధ అనుకున్న ఆవిడని మనవడుతో ఎలా కలిపాడో?" అంటూ బుగ్గలు నొక్కుకున్నారు చుట్టూ చేరిన అమ్మలక్కలు.

ఈ లోగా రెడ్డిగారు ఇందాకటి పెద్దాయన్ని దగ్గరకు పిలిచి, "మా వాడు పాపం దుఃఖంలో ఉన్నాడు. మీరే దగ్గరుండి శాస్త్రయుక్తంగా కర్మకాండ జరిపించి, తరువాత మా వాడిని బస్సు ఎక్కించి పంపించండి. నేను అర్జంటుగా ఎమ్.పీ. గారిని కలవాలి. లేకపోతే నేనే ఉందును!" అంటూ ఓ పదివేలు ఆయన చేతిలో పెట్టి, లారీ ఎక్కి డ్రైవర్ ని తీసుకుని అక్కడి నుండి వెళ్ళి పోయారు.

***

సాయంత్రం ఆఫీసు కొచ్చిన శీను గాడి చేతిలో ఓ వెయ్యి రూపాయలు పెట్టారు గుమాస్తా కృష్ణమూర్తి గారు. అది చూసి..

"ఏంటయ్యా ఇది?" అడిగాడు శీను.

"నువ్వు పొద్దున్న చేసిన నటనకు ప్రతిఫలంరా! అంటే.. సుజల నుంచి సుఫలం అనుకో. నువ్వు ఇలాగే కేసులు లేకుండా, నీ నటనతో మాఫీ చేసేసేవనుకో, నీకు ఇలాగే భవిష్యత్తులో బోలెడు కానుకలు ఇస్తారు సుజలరెడ్డి గారు!" గార పళ్ళు బయటకు కనబడేలా నవ్వుతూ చెప్పారు గుమస్తా గారు.

ఆనందంగా ఆ డబ్బులు జేబులో దోపుకున్నాడు శీనుగాడు.

***

లారీ చక్రం కంటే వేగంగా కాల చక్రం ఐదు సంవత్సరాలు గిర్రుమని తిరిగింది. కాలంతో పాటు, టేంకర్లో శీనుగాడి సీటు కూడా మారింది.

ఆ రోజు....

"ఏరా శీనూ! ఈ క్లీనర్రాజుగాడికి మనకు ఉపయోగపడేలా ట్రైనింగ్ ఇయ్యి!" చెప్పారు కాంట్రాక్టరు రెడ్డి గారు, డ్రైవింగ్సీట్లో ఉన్న శీనుకి.

"అయ్యా, ఈ రోజే కదా చేరింది, బాగానే పికప్ ఔతాడు. మన పద్ధతులు అన్నీ చెబుతానయ్యా!" చెప్పాడు శీను.

ఎవరితోనో ఫోన్ లో మాట్లాడుతున్న రెడ్డి గారు సడన్ బ్రేక్ వేయడంతో ముందుకు పడబోయి నిలదొక్కుకున్నారు.

"ఏరా, శీనుగా? ఏమయ్యింది?"

"అయ్యా! ఎవరో బండి కింద పడ్డారయ్యా !."

"నిన్ను తగలెయ్యా! ఎంత పని చేసావురా ? ముందు కిందకి దిగి ఏం జరిగిందో చూడు! ఈ రాజు గాడు వద్దులే, వీడికి కొత్త. నువ్వే దిగు!" అంటూ సలహా ఇచ్చారు.

అప్పటికే చుట్టుపక్కల జనం వెనక చక్రం కింద పడి చనిపోయిన ముసలతను వద్ద చేరి అతని గురించి చర్చించుకుంటున్నారు.

"అదిగో డ్రైవర్, పారిపోకుండా పట్టుకోండి" అంటూ అతని మీదకు దూసుకొచ్చారు అక్కడ చేరిన జనం.

కిందకు దిగిన శీనుగాడు, అలవాటు ప్రకారం ఆ చనిపోయిన వ్యక్తిని బయటకు లాగి, పరిశీలనగా చూసి, అతని మీద పడి,

"నాన్నా! ఎంత పని చేసావు నాన్నా, పదిహేను సంవత్సరాలుగా నీ కోసం వెతుకుతున్నాం. ఆఖరికి ఇలా కనపడ్డావా?" అంటూ అతని మీద పడి భోరున విలపించసాగేడు.

ఈ లోగా రెడ్డిగారు లారీ దిగి, అక్కడే ఉన్న ఓ ముసలాయన్ని దగ్గరకు పిలిచి, "మా వాడు పాపం తండ్రి పోయిన దుఃఖంలో ఉన్నాడు. మీరే దగ్గరుండి శాస్త్ర యుక్తంగా కర్మకాండ జరిపించండి. నేను అర్జంటుగా మినిస్టర్ గారిని కలవాలి. లేకపోతే నేనే ఉందును!" అంటూ ఓ ఇరవై వేలు ఆయన చేతిలో పెట్టి, క్లీనర్ రాజును పక్కకు పిలిచి, "ఇలాంటి సందర్భాల్లో ఎలా నటించాలో ఆ శీనుగాడిని చూసి నేర్చుకో. పని పూర్తి కాగానే ఇద్దరూ కలసి రండి" అని చెప్పి, లారీని నడుపుకుంటూ వేగంగా వెళ్ళి పోయారు రెడ్డి గారు, అక్కడ ఉన్న వారి మొహాలమీద దుమ్ము కొట్టుకుంటూ.

***

సాయంత్రం ఆఫీసుకొచ్చిన శీను గాడి చేతిలో ఓ ఐదు వేల రూపాయలు పెట్టారు గుమాస్తా కృష్ణమూర్తి గారు. అది చూసి..

"గురువు గారూ వద్దండి. మీ దగ్గరే ఉంచండి" అన్నాడు శీను.

"ఏరా, ఎప్పుడూ లేనిది ఏంటి ఇలా కొత్తగా మాట్లాడుతున్నావు? ఇది సరిపోలేదా? లేక ఇది పాపపు సొమ్ము అని ఆలోచిస్తున్నావా?'' అడిగారు కృష్ణమూర్తిగారు.

"అది కాదు సార్, అనాధ శవాలకు సాయం చేస్తే మంచిదని, మా అమ్మ చెప్పింది. అందుకే ఈ రోజు నుంచి ఇటువంటి పనులకు డబ్బులు తీసుకోకూడదని నిశ్చయించుకున్నా. పెద్దయ్య గారికి చెప్పకండి!" అంటూ చెప్పి వెళ్తున్న శీనుని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు కృష్ణ మూర్తి గారు.

ఇంటికి వెళ్ళడానికి బయలుదేరిన శీను పొద్దున్న జరిగిన సంఘటన గురించి ఆలోచిస్తూ, సైకిల్ తొక్కుతున్నాడు.

***

"అమ్మా! నేను ఈవేళ చాలా ఘోరమైన తప్పు చేసేనమ్మా!" తల్లితో అన్నాడు శీను.

"ఏంటి బాబూ, ఏం చేసావు?" ఆందోళనగా, కొడుకును కుదిపేస్తూ అడిగింది.

"ఒక పెద్దాయన మీంచి లారీ ఎక్కించేసానమ్మా!" బాధగా చెప్పాడు శీను.

"అయ్యయ్యో, ఎంత పని చేసావురా, ఇంతకీ ఎవరాయన?"

"ఆయన ఎవరో కాదు అమ్మా, మా నాన్న. అయన్ని నా చేతులతో నేనే చంపేసాను!" రెండు చేతులలోనూ మొహం పెట్టుకొని ఘొల్లుమన్నాడు శీను.

"ఎంత ఘోరం జరిగిందిరా బాబూ" అంటూ హృదయ విదారకంగా రోదిస్తూ....

"ఔనూ, మీ నాన్న మనల్ని వదిలేసి పదిహేను సంవత్సరాలయ్యింది కదా? నీకు అప్పటికి పదేళ్లు ఉంటాయి. మీ నాన్న అని ఎలా గుర్తుపట్టేవ్. బహుశా ఎవరో అయ్యుంటారు!" ఎక్కడో మిణుకు మిణుకు మంటున్న ఆశతో అడిగింది.

"లేదమ్మా, నా చిన్నప్పుడు నాన్న రంపపు మిల్లులో పని చేసినపుడు ప్రమాదంలో కుడి, ఎడమ చేతులు రెండింటికీ కూడా చూపుడు వేలు, మధ్య వేళ్ళు సగానికి పైగా తెగిపోవడం నాకు బాగా గుర్తు. అంతేకాదు ముక్కు చివర కొట్టొచ్చినట్లు ఉండే ఆ ఉలిపిరి కాయ కూడా నాకు జ్ఞాపకం ఉంది. ఆ ఆధారాలు చూసే నాన్నే అని నిశ్చయించుకుని దహన సంస్కారాలు నేనే చేసేనమ్మా. అందుకే మా పెద్దయ్య గారు ఐదువేలు ఇచ్చినా

తీసుకోలేదు!" అని ఏడుస్తూ చెబుతూ, తల్లి అక్కడ లేకపోవడం చూసి, "అమ్మా అమ్మా" అంటూ లోపలి గదిలోకి వెళ్ళేడు.

అప్పటికే తలలో పూవులు, బొట్టు తీసేసి, గాజులు కూడా తీసేయబోతున్న తల్లిని చూసి, అమ్మా.... అంటూ బిగ్గరగా అరిచాడు శీను.


***

ఆలోచనలోంచి ఉలిక్కిపడి తేరుకున్న శీను, సైకిల్ స్టాండు వేసి ఇంట్లోకి వెళ్ళి, "అమ్మా, ఈ రోజు నేను ఓ అనాధకు నా స్వహస్తాలతో దహన సంస్కార కార్యక్రమం నిర్వర్తించేనమ్మా ! మా అయ్యగారు డబ్బులు ఇచ్చినా తీసుకోలేదు!" చెప్పాడు శీను.

"ఔను బాబూ! నిజమే, అనాధ శవాలకు సాయం చేస్తే, చాలా పుణ్యం వస్తుంది. సరే కానీ ఈ మంచి నీళ్లు తాగి కాళ్ళు కడుక్కొని రా, భోజనం చేద్దువు గాని!" అంది తల్లి.

"నాన్న పోయాడని అమ్మకు ఎప్పటికీ చెప్పకూడదు. అమ్మ ఎప్పటికీ సుమంగళిగానే ఉండాలి. ఎప్పుడో పదిహేను ఏళ్ళ క్రితం నాకూ, అమ్మకు నీళ్లు వదిలి, తన దారి తాను చూసుకుని వెళ్లి పోయిన నాన్న మరణం గురించి అమ్మకు చెపితే, ఆమ్మ కళ్ళ వెంట కారే ఆ కన్నీళ్లు తాను చూడలేడు.  ఈ రహస్యం ఎప్పటికీ తనలోనే దాచుకోవాలి!" అని మనసులో అనుకొని, ఉదయం చనిపోయిన తండ్రికి మరోసారి భక్తితో నీళ్ళు వదిలాడు శీను.

**O**



# జంట కవులు

## రాజేష్ యాళ్ల

"ఒక పాయింట్ టూ ఫైవ్ పర్సెంటో హాఫ్పర్సెంటో అటూ ఇటూ ఉంటుందండీ. అందుకని బైటకి వెళ్లిపోతారా? ఈ బ్యాంక్ బ్రాంచ్ ఓపెన్ చేసినప్పటి నుంచీ మీరు మాకు కస్టమర్గా ఉన్నారు. ఎలా వెళ్లిపోతారు బైటకి?!" సతీష్ సంధించిన వాక్బాణాలకు ఆ కస్టమర్ చిరునవ్వు నవ్వడం తప్ప ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

"ఒరేయ్ హరీ... సార్ డిపాజిట్ అప్రూవల్ కొట్టేయ్!" అంటూ గబగబా తను చేసిన డిపాజిట్ ఎకౌంట్ని హరి చేత పాస్ చేయించి, డిపాజిట్ రసీదు ప్రింట్ తీసి, సంతకం పెట్టి, మెసెంజర్ని పిలిచి, నా దగ్గరకు మరో సంతకం కోసం, ఫైనల్ వెరిఫికేషన్ కోసం పంపించాడు సతీష్.

నా కేబిన్ ఎదురుగా ఉన్న కౌంటర్లో సతీష్ కూర్చుంటాడు. నా కేబిన్ పక్కనే ఉన్న టేబుల్ ముందు హరి కూర్చుంటాడు. మిగతా సిబ్బంది అతని ఎదురుగా ఉన్న కౌంటర్ వెంబడే ఉంటారు. ఆ తర్వాత కేష్ కౌంటర్స్. ఏ ఖాతాదారుడు వచ్చినా వాళ్లను ముందుగా పలకరించేది సతీష్. దాదాపు వాళ్ల పని సగం అక్కడే అయిపోయేలా చూస్తాడు. లేదంటే 'ఒరేయ్ హరీ' అంటూ సదరు ఖాతాదారుడి వైపు చూపించి, అతనిని హరి దగ్గరకు పంపడం, అక్కడ మిగతా వారి సహాయంతో ఆ పని త్వరత్వరగా హరి పూర్తి చేయడం .. నేను ఈ బ్రాంచ్ మేనేజర్గా రోజు చూస్తూండే వ్యవహారం.

నేను ఇక్కడకొచ్చి దాదాపు రెండున్నర ఏళ్లు కావస్తోంది. సతీష్, హరి కొత్త ప్రొబేషనరీ ఆఫీసర్లుగా చేరి దాదాపు రెండేళ్లు గడుస్తోంది. మిగతా శాఖల మేనేజర్లు అందరూ అసూయ పడేలా వీళ్లిద్దరూ వచ్చినప్పటినుంచీ బ్రాంచ్ వ్యాపారం మూడింతలుగా పెరగడం విశేషం. బ్రాంచ్లో చేరటానికి వాళ్లిద్దరూ ఒకేసారి వచ్చినప్పుడు, సతీష్ని చూడగానే నా ముఖంలోని వెలవెలను దాచుకోవడానికి చాలా కష్టపడ్డాను. హరిని చూసి మాత్రం ఊరట చెందాను.

కానీ అతి త్వరలోనే నా అంచనా తలక్రిందులైంది. హరి ఎంత బాగా పని చేస్తాడో.. సతీష్ అంతే చురుగ్గా పని చేయడం చూసి నాతో పాటు మిగతా సిబ్బంది అంతా కూడా ఆశ్చర్యపోయారు. అతని చురుకుదనానికి తోడుగా

సతీష్ మాటకారితనం అందరినీ ఆకట్టుకునేది. అందుకనే అతన్ని రిసెప్షన్ దగ్గరే కూర్చోబెట్టాను. హరిని లోపల కూర్చోబెట్టాను. నా నమ్మకం వమ్ము కాలేదు. వచ్చిన రెండు నెలలకే.. బ్రాంచ్‌లోని సిబ్బంది ఎవరెవరితో ఎలా పని చేయించుకోవాలో, అలా చాకచక్యంగా పని రాబట్టుకుంటూ బ్రాంచ్‌ని ముందుకు పరుగులు తీయించారు సతీష్, హరిలు! క్షణాలలో ఎదుటి వారిని కట్టి పడేసి, నోట్లో బూరెలు వండినట్టుగా వాళ్ల నుంచి బిజినెస్ రాబట్టేసేవాడు సతీష్. మిగతా పని హరి చూసుకునేవాడు.

ఈ విశాఖ చుట్టుపక్కల జనాలలో ఓ విధమైన చొరవను నేను గమనించాను. అదేంటంటే ఇంచుమించుగా ఒక ఈడు వాళ్లైతే స్వల్ప పరిచయంలోనే 'ఒరేయ్' అని అనేసుకోవడం! దానికి తోడు ఒకే రోజు చేరడం వలన కూడా కావచ్చు...వాళ్లిద్దరూ 'ఒరేయ్ ఒరేయ్' అనుకుంటూ కలసిపోయారు.

ఇంచుమించుగా దగ్గరి ప్రాంతాలలోనే వాళ్లిద్దరి ఇళ్లూ ఉండటంతో ఇద్దరూ కలిసే బ్రాంచ్‌కి ఆటోలో వచ్చేవాళ్లు. నేను మిగతా వాళ్లు తిన్నాక, లంచ్ రూముకెళ్లి భోంచేసేవాడిని. సతీష్, హరి కూడా జంటగా వచ్చి నాతో పాటే తినేవాళ్లు. సాయంత్రానికల్లా చకచకా దైనందిన లావాదేవీలు ముగించుకుని, ఇంకా ఏదైనా పని ఉంటే నన్నడిగి మరీ తీసుకుని, అది కూడా పూర్తి చేసి కలిసే బయలుదేరేవాళ్లు ఇద్దరూ.

అనతికాలంలోనే వాళ్లకి అన్న పేరు స్థిరపడిపోయింది. ఒకరికొకరు చేదోడు వాదోడుగా, మా బ్రాంచ్‌లో తలలో నాలుకల్లా ఉన్న వాళ్ల స్నేహాన్ని చూస్తే చాలా ముచ్చటగా ఉండేది.

ఒకరోజు సాయంత్రం ఇంటికెళ్లడానికి బయలుదేరి, నా దగ్గరకు వచ్చారు వాళ్లిద్దరూ. నేను తలెత్తి, "ఏంటర్రా జంట కవులూ! బయలుదేరుతున్నారా?!" నవ్వుతూ సరే అన్నట్టుగా తల ఊపాను.

"చిన్న రిక్వెస్ట్ సర్..." సతీష్ అడిగాడు.

"ఏంటోయ్ సతీష్, నువ్వు చిన్నదంటే, అది కొంచెం పెద్దదే అవుతుంది!" నవ్వాను.

"సతీష్‌కి ఓ రెండు వారాలు సెలవు కావాలట సర్!" హరి చెప్పాడు.

"రెండు వారాలా?! సతీష్ లేకుండానా? బ్రాంచ్ నడుస్తుందనే?!" నా గుండెలో రాయి పడిన మాట నిజం!

"అవును సర్. మొన్న జేఏఐఐబీ ఎగ్జామ్స్‌కి అప్లై చేయించారు కదా మీరు?!" సతీష్ అన్నాడు.

"ఓహో! 'మొత్తం మీరే చేసారు నాన్నా' అని బొమ్మరిల్లు సినిమాలో సిద్దార్థ అన్నట్టుగా బాణం నా మీదకే వదిలావా? అమ్మ సతీషూ!" నవ్వుతూ చెప్పాను.
"కొంచెం ఎడ్జస్ట్ చేసుకోండి సర్..." హరి అన్నాడు.

"రెండు వారాలంటే కొంచెం ఇబ్బందే కదా హరీ.. సరే చూద్దాం లే!" అన్నాను సతీష్ ముఖంలోకి చూస్తూ.
సతీష్ ఇంకా అసంతృప్తిగానే చూస్తున్నాడు.

"సరే అన్నాగా ఇంకా ఏంటీ?" అడిగాను.

"అది... రెండు వారాలూ హరి కూడా రాడు సర్... ప్లీజ్!" దీనంగా ముఖం పెట్టి అడిగాడు సతీష్.

"వ్వాట్! హరి కూడా లేకుండానా?! ఇంపాజిబుల్!!" ఇందాకటి రాయి ఇప్పుడు కొండలా మారి గుండెను నొక్కుతోంది గట్టిగా.

"అవును సర్. మొదటి రెండు సబ్జెక్ట్‌లు పెద్ద కష్టం అనిపించలేదు. మిగతా మూడు సబ్జెక్ట్లకీ మూడు వరుస ఆదివారాలలో పరీక్షలున్నాయి సర్. అందుకని ఇద్దరం కలిసి చదువుకుందామని...." హరి అన్నాడు.

"మీ ఐడియా బ్రహ్మాండమేనబ్బా! కానీ ఇక్కడ నా సంగతేంటి? మీ అంత రెస్పాన్సిబుల్‌గా బ్రాంచినెవరు చూస్తారు?!" కొంచెం ఆవేశంగా అడిగాను.

"ఈ పరీక్షలు త్వరత్వరగా పూర్తిచేస్తే ప్రమోషన్స్ కూడా త్వరత్వరగా వస్తాయని మీరేనా చెప్పారూ?!" చిన్న పిల్లాడిలా అడిగాడు సతీష్.

నేనేదో అనబోతుంటే అతనే అన్నాడు... "ఇదే మీ పిల్లలైతే కాదంటారా చెప్పండి?! పైగా ఇక్కడ జాయిన్ అయినప్పటి నుంచీ మమ్మల్ని మీ పిల్లల్లానే కదా చూసుకుంటున్నారు!" ముందరి కాళ్లకు బంధం వేసి కట్టి పడేసాడు సతీష్.

"ఫర్వాలేదు చూడండి సర్. మీకు ఏ ఇబ్బందీ రాకుండా చూసుకోమని మిగతా అందరు సర్స్‌కీ, మేడమ్స్ కీ మేం చెప్పి వెళతాం!" హరి బ్రతిమాలాడు.

ఉద్యోగంతో పాటు వ్యక్తిగతమైన ఉన్నతికి కూడా కలసి ఒకరి కోసం ఒకరన్నట్టుగా సహాయం చేసుకునే వాళ్లిద్దరి సంకల్పానికీ ముచ్చట వేసింది. దాంతో వాళ్ల అభ్యర్ధనను త్రోసి పుచ్చలేకపోయాను. 'సరే' అన్నట్టుగా తల ఊపాను.

"హే!" ఆనందంగా చేతులెత్తి ఊపి, కరచాలనం చేసుకుని "థ్యాంక్యూ సర్!" అంటూ చెప్పారిద్దరూ ముక్తకంఠంతో. మరో ఏడాది కాలంలో మరో రెండుసార్లు కూడా ఇదేవిధంగా ఇబ్బంది పెట్టారు జంటకవులిద్దరూ. జేఏఐబీ పరీక్షలయ్యాక మరో ఆరు నెలలకి సీఏఐబీ పరీక్షలకీ. ఆ తర్వాత మరో ఆరు నెలలకి ప్రమోషన్ పరీక్షకీ!

ప్రమోషన్ టెస్ట్ రాసి దాదాపు పదిహేను రోజులవుతోంది. ఓ రోజు మధ్యాహ్నం నాకు హెడ్డాఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. హరికి ప్రమోషన్ వచ్చినట్టు. నా నెత్తిన పిడుగు పడినట్టైంది హరికి దగ్గరగా వెళ్లి విషయం చెప్పాను. "అదేంటి సర్. వాడికి రాకపోవడం ఏంటీ?!" హరి కన్నుల్లో నిండుగా నీళ్లు. తన ప్రమోషన్ హరిని సంతోషపెట్టలేదు.

అంతలో మా వైపుకి చూస్తూ పెద్దగా అరిచాడు సతీష్. "అరే హరీ కంగ్రాట్స్‌రా! కుమ్మేసావ్!" నవ్వుతూ ఉన్న చోటు నుంచే హరిని అభినందించాడు సతీష్. వాట్సాప్ లో మెసేజ్ వచ్చినట్టుంది. వాడికి వాడి సంగతి పట్టినట్టు లేదు!

బాధగా నా వైపు చూసాడు హరి. నా కళ్లు కూడా చెమర్చాయి.

సతీష్ దగ్గరికి వెళ్లి చెప్పాను. "తర్వాత మరో లిస్ట్ వస్తుందిలే సతీష్. అందులో నీ పేరు తప్పకుండా ఉంటుంది!" ఓదార్పుగా చెప్పాను.

"వాడు దుళ్లగొట్టేసాడు కదా సర్. నాదేముందీ తర్వాతైనా వస్తుంది!" సతీష్ కన్నుల్లో కాగడా పెట్టి వెతికినా బాధ కనపడేలా లేదు.

హరి కూడా మా దగ్గరకు వచ్చి, "సారీరా సతీష్!" అని సతీష్ చేతులను పట్టుకున్నాడు.

"నువ్వు మరీన్రా! ఇప్పుడేమైందీ...నువ్వెంత బాగా సబ్జెక్ట్ నాకు చెప్పేవాడివి? నువ్ డిజర్వ్‌డ్‌రా!" నవ్వాడు సతీష్.

"ఏంలాభం? నువ్ కూడా అవనిదే?!" దిగాలుగా అన్నాడు హరి.

"ఓవరేక్షన్ చెయ్యకురా!" అంటూ పకపకా నవ్వేసాడు సతీష్.

నాలుగు రోజులు గడిచాయి. ఒకరోజు హరి దగ్గరకు వెళ్లి అన్నాను, "నీకు రీజియన్ లోనే పోస్టింగ్ ఉండేలా చూడమని చెబుతాను."

"నేను వెళ్లను సర్. నాకు ప్రమోషన్ వద్దు!" తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు హరి. "వాడికి రాకుండా వాడిని వదిలి నేనెందుకు వెళతాను సర్!" బింకంగా అన్నాడు హరి.

"నీకేమైనా మతి పోయిందా? వాడి కోసం నీ కెరీర్ని వదులుకుంటావా?" మందలించబోయాను, విస్మయంనుంచి క్షణంలో తేరుకుని.

"మరేం ఫర్వాలేదు సర్. వచ్చే సారైనా ఇద్దరం కలిసే ప్రమోషన్ తీసుకుంటాం."

"అలా అనకు. నువ్వు మీ పేరెంట్స్ తో మాట్లాడు. ప్రమోషన్ అనేది నీ జీవితంలో చాలా విలువైన మైలురాయి. ఇంకో వారం సమయం ఉంది, బాగా ఆలోచించుకో!" హరికి నచ్చచెప్పే ప్రయత్నం చేసాను.

మరో మూడు రోజుల తర్వాత ఓ సాయంత్రం నాకు హెడ్డాఫీస్ నుంచి ఫోన్ వచ్చింది.

పరుగులాంటి నడకతో సతీష్ దగ్గరకి వెళ్లి విషయం చెప్పాను... "సతీష్ కంగ్రాట్స్! రెండో జాబితాలో మొదటి పేరు నీదే!"

లిప్తకాలం మెరుపు తీవెలా వెలిగిన సతీష్ ముఖం అంతలోనే వాడిపోయింది.

"నేను వెళ్లను సర్!"

నిర్ఘాంతపోవడం నా వంతయింది. "ఏం మాట్లాడుతున్నావ్?! బంగారంలాంటి అవకాశం ఇది. బుద్ధి లేకుండా మాట్లాడకు!" కోపంగా అన్నాను.

"అదే మాట వాడికీ చెప్పండి. వాడు తీసుకోకపోతే నాకూ ప్రమోషన్ వద్దు!" మొండిగా చెప్పాడు సతీష్.

అంతలోనే హరి మా దగ్గరకు వచ్చాడు. "కంగ్రాట్స్ రా! అనుకున్నా.. ఏదో తేడా అయిందని. లేకపోతే నీకు ప్రమోషన్ రాకపోవడం ఏంట్రా?" నవ్వుతూ అన్నాడు హరి.

వాళ్లిద్దరూ కాసేపు నేను వెళ్లనంటే వెళ్లననీ, నువ్వెళితేనే నేనూ వెళ్లేదనీ వాదులాడుకుంటోంటే నేను నా కేబిన్లోకొచ్చి ఫోనందుకున్నాను...వాళ్లిద్దరినీ మా బ్రాంచ్‌లోనే ప్రమోషన్లోనూ ఉండేలా కానీ, లేదా ఇద్దరినీ ఒకే ఆఫీస్‌కి వేసేలా చూడమని హెడ్డాఫీస్ వాళ్లకు చెప్పడానికి!

మరో అరగంటకు పనులు ముగించుకుని నాకు వీడ్కోలు చెప్పి, బయలుదేరారు వాళ్లిద్దరూ!

చచ్చుబడిపోయిన రెండు కాళ్లతో చక్రాల కుర్చీలో కూర్చుని ఉన్న సతీష్! ఆ కుర్చీని ఎప్పటిలా తోసుకుని వెళుతూ హరి! జంట కవులు!!

**0**

కథా మంజరి



# కరణేషు మంత్రి

## ఓరుగంటి శర్మ

అన్నపూర్ణమ్మ గారు పులిహోర కలుపుతుంటే... సరిగ్గా తాళింపు పెట్టే సమయానికి వెళ్ళారు చుట్టుపక్కల కోతి గుంపు. అందరి చేతుల్లో తలో ముద్దా పెట్టారు ఆవిడ.

అమృతం కలిపిన ఆ చేతుల్లో ఉందో... వండిన వంటలో ఉందో...తినేసి మళ్ళీ చెయ్యి చాచారు. నవ్వుతూ మళ్ళీ పెట్టారు అందరికి.

"అమ్మమ్మగారూ ఇవ్వాళ పండగ కాదు కదండీ... మరి పులిహోర ఎందుకు కలిపారండి?" అడిగింది ఓ గడుగ్గాయి.

"మీ తాతగారు జ్వరం వచ్చిన వాళ్ళకి మందులివ్వడానికి ఊరెళ్తున్నారు. అక్కడ అందరికీ తినడానికి ఉంటుందని చేశాను!" అంటూ పేద్ద స్టీలు క్యారేజీలో ఆ పులిహోరను సర్ది, డ్రైవర్ కు ఇచ్చి పంపేశారు.

వెళ్ళిపోతున్న పిల్లల్ని పిలిచి ఒక్కొక్కరి చేతుల్లో రబ్బరు బంతంత ఉన్న సున్నుండలు పెట్టడంతో వాళ్ళ మొహాలు వెలిగిపోయాయి.

***

అన్నపూర్ణమ్మగారి భర్త అయ్యగారి విశ్వేశ్వరశాస్త్రి గారు. వాళ్ళది కాకినాడ దగ్గరున్న వి.కె.రాయపురం. ఆ ఊరు నుండి ఎం.బి.బి.ఎస్. చదివిన మొదటి వ్యక్తి ఆయనే. భద్రాచలం, రాజవొమ్మంగి, రంపచోడవరం, అడ్డతీగల, మొదలైన చోట్ల పనిచేసి, ప్రస్తుతం చింతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గా చేస్తున్నారు. ఇంకో మూడు నెలల్లో రిటైర్‌మెంటు.

ఆయన చేతి హస్తవాసి చాలా మంచిదని, కానీ బొత్తిగా లోకజ్ఞానం లేని మనిషని ఆయన్ని ఎరిగిన వాళ్ళు ఇట్టే చెప్పేస్తారు. సొంత డబ్బులతో జనాలకు వైద్యం చేసినందుకు, ఊర్లో ఉమ్మడి ఆస్తిలో ఆయన వాటాగా వచ్చిన ముప్పై ఎనిమిది ఎకరాలు ఇప్పుడు నాలుగు ఎకరాలు అయ్యింది.

ఆయన సొంత మేనమామ కూతురు అన్నపూర్ణమ్మ. ఆవిడ బడి గుమ్మం ఎక్కలేదు కానీ... పెద్ద బాలశిక్ష మొత్తం బట్టీ పట్టేశారు పెళ్ళికి ముందే.  ఎనిమిదో యేడు ఆయనతో పెళ్ళయి, మెట్టినింటికొచ్చారు. అప్పటికి ఆయనకు పన్నెండు!  ఇప్పటికి నలభై ఆరు సంవత్సరాలు గడిచాయి ఆ చేయి పట్టుకుని!

***

ముందు రోజు సీలేరు లో మెడికల్ క్యాంపుకి వెళ్లిన శాస్త్రిగారు, చంద్రుడు వచ్చే వేళకి వచ్చారు. మొహంలో ఆందోళన కొట్టొచ్చినట్లు కనబడుతోంది.  ఆ రాత్రి వరండాలో పక్క వేసి... ముందు రోజే పాలు వాడకం పోసే వెంకడు చేత తెప్పించి పెట్టిన ముర్రుపాలతో చేసిన జున్ను తీసుకుని వెళ్ళి ఆయనకు ఇచ్చారు. ఆయన పక్కన కూర్చుని కనకాంబరాలు మాల కడుతూ...  "ఏమైంది?... ఈ రోజు అదోలా ఉన్నారు?" అని అడిగారు అన్నపూర్ణమ్మ గారు.

"ఏమని చెప్పేది... నిన్న మేం క్యాంపు చేసిన ఊరికి, వాళ్ళు వచ్చారు".

"వాళ్ళు అంటే...?"

"అదే అన్నలు..!"

"ఎవరికి అన్నలు?"

"నీ తలకాయ్. ఇన్నేళ్ళు వచ్చినా బుర్రలో గుజ్జు పెరగలేదు. అన్నలు అంటే నక్సలైట్లు!"

"మిమ్మల్ని ఏమైనా అన్నారా"?

"లేదు!"

"మరింకేం.."

"అలా అంటావేంటి. వాళ్ళని అంత దగ్గరగా చూసేసరికి భయం వేయదా!"

"మరేం చేశారు మీరు?"

"నేనేం చేస్తాను... ఏం చెయ్యలేదు!".
"అంటే వాళ్ళు ఏదో చేశారా?"

"అవును!"

"ఏం చేశారేంటి... మీ దగ్గరున్న పులిహోర చూసి ఆకలిగా ఉందని తినేశారా?"

"అవును..."

"సరే.. ఇంత తినేసి పోయింటారు. దానికి మీరెందుకు బాధపడటం! మీరు తింటానంటే రేపే చేసి పెడతాను!"

"నీ గోలే నీది కానీ... ఎదుటి వాడి మాట వినవు కదా..."

"సరిగ్గా చెబితేనే కదా తెలిసేది.."

"తమ ఆనుపానులు చెబుతున్నారని, ఇద్దరిని పట్టుకుని కొట్టారు!"

"ఆహా... మరి అలా ఎదుటి వాళ్ళ రహస్యాలు బయట పెట్టడం తప్పే కదా! ఓ రెండు దెబ్బలు కొట్టి వదిలేసి ఉంటారు!" అని అమాయకంగా అంటున్న ఆవిడ చేతిని దగ్గరకు తీసుకున్నారు ఆయన. ఆయన్ని హత్తుకుని ఒడిలో పడుకుండిపోయారు ఆవిడ.. ఇంకో మాట మాట్లాడకుండా!

***

వారం రోజులు తర్వాత...

పేపర్లో "దారకొండ దగ్గర మందుపాతర పెట్టి పోలీసు వాహనాన్ని పేల్చేసిన నక్సలైట్లు. నలుగురు పోలీసులకు గాయాలు" అని వచ్చింది.

దాడి జరిగిన రెండు రోజుల తర్వాత... పోలీసులు శాస్త్రిగారి ఇంటికి వచ్చి ఎదురుగా ఉన్న టేబుల్ మీద ఓ స్టీలు రేకు లాంటిది పెట్టారు. అది చూసి 'అర్థం కాలేదు' అన్నట్లు చూశారు వచ్చిన పోలీసాఫీసరు వైపు ఆయన.

"ఇది మొన్న నక్సలైట్లు మందుపాతర పెట్టడానికి వాడిన స్టీలు క్యారెజీ! దీని మీద అయ్యగారి పూర్ణయ్య సిద్ధాంతిగారి జ్ఞాపకార్థం వారి అబ్బాయి అని ఉంది. అంటే మీరే కదా" అనడంతో...
పులిహోర క్యారెజీ ని వాళ్ళు మందుపాతరగా వాడినట్లు అర్థమైన శాస్త్రిగారు... అవునని, కాదని బుర్ర ఊపి కూలబడిపోయారు.

ఇదేమీ పట్టని ఆ పోలీసాఫీసరు "మీకు వాళ్ళకి ఏంటి సంబంధం? మీరు వాళ్ళకు సాయం చేస్తున్నారా? ఎన్నాళ్ల నుండి మీరు ఇలా వాళ్ళతో కలిసి పనిచేస్తున్నారు?" అంటూ వరస ప్రశ్నలు గుప్పించేస్తున్నాడు.

అప్పటివరకు గుమ్మం అవతలే ఉండి అన్నీ వింటున్న అన్నపూర్ణమ్మ గారు ఇవతలికి వచ్చి ప్లాస్టిక్ కవర్లో ఉన్న రేకు ముక్కని చూసి... పోలీసాఫీసరు తో... "అవును నాయనా... ఇది మాదే! అంటే మా ఇంటిలోదే. మా మావయ్యగారి సాంవత్సరీకానికి గుర్తుగా ఇచ్చిన వాటిల్లో అందరికీ పంచగా, చివరాఖరికి ఒకటి మిగిలితే మా మావయ్యగారి గుర్తుగా మాతో తెచ్చుకున్నాము. బుజ్జిది పాతికేళ్ళ పాటు మాతోనే ఉంది".

హద్దు అదుపు లేకుండా ఆవిడ అలా చెప్పుకుంటూ పోతుంటే ఆ నక్సలైట్లు చేసిన పనికి తనని పోలీసులు ఎక్కడ తీసుకునిపోతారో అని శాస్త్రిగారు భయపడుతూనే తనని ఆగమని సైగచేసి చెబుతున్నా ఆవిడ ఆగడం లేదు.

"ఒక్క క్షణం నాయనా ఇప్పుడే వస్తాను!" అంటూ... పెరటిలోకి వెళ్ళి టకటక నిమ్మకాయలు కోసి... పంచదార, ఉప్పు కలిపి లోటా తో ఇన్ని నిమ్మకాయ నీళ్ళు తీసుకొచ్చారు తాగడానికి.

ఆవిడ ఏం చేస్తోందో అర్థంకాక... పోలీసాయన ఏం అడిగినా వంటింటి వైపు చూస్తూ... ఊ... ఊ... అంటూ ఉండిపోయారు శాస్త్రిగారు.

పోలీసాయాన్ని ఇన్ని నీళ్ళు తాగించి... "అవునూ... ఇంతకూ ఈ క్యారెజీ ఎక్కడ దొరికింది? మీకు"... అని అడిగిన ఆవిడ వైపు కోపంగా చూస్తూ... "అదేంటమ్మా ఇంత సేపూ చెప్పింది ఏదీ మీరు వినలేదా? మీ ఆయనకు నక్సలైట్లతో ఉన్న సంబంధం తెలుసుకోడానికి వచ్చాను!" అంటూ అతను సీరియస్సుగా చూసాడు.

"తప్పుగా అనుకోకు నాయనా... మావారికి పెట్రోమాక్స్ లైట్లు తప్ప ఏ నక్సలైట్లు తెలీవు. ఇంకో విషయం ఏమిటంటే... ఓ పదిహేను రోజుల క్రితం ఓ ముష్టి వెధవ మా వీధిలోకి వచ్చి, పాత సామాన్లకు మాట్లు వేస్తాను అంటే... ఆ క్యారెజీ ఇచ్చాను. వాడేమో కాసేపు అటూ ఇటూ తిప్పి... దాహానికి మంచి నీళ్ళు అడిగితే నేను తీసుకుని వచ్చే లోపు ఆ క్యారెజీ తీసుకుని పోయాడు దొంగ వెధవ! నేను అప్పుడే చెప్పాను ఈయనతో. పోయి

కంప్లైంట్ ఇవ్వండి అని. ఈయనేమో పోతే పోనీలేవే కొత్తది కొనుక్కుందాం అంటూ బద్దకించారు. వాడు ఎవడికి అమ్మేశాడో ఏంటో... మాకేం తెలుసు... ఇదిగో ఇప్పుడు ఆ ముక్క పట్టుకుని నువ్వు మా ఇంటికి వచ్చేసావు!" అంటూ ఆపకుండా చెప్పుకుంటూ వెళ్తున్న ఆవిడ వైపు శాస్త్రిగారు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు.

"అంటే ఈ క్యారెజీ మీ ఇంట్లో నుండి ఎవడో ముక్కూ మొహం తెలియనివాడు... దొంగతనం చేశాడని అంటున్నారా!" అంతకంటే ఏమడగాలో తెలియలేదు ఆ పోలీసాఫీసరుకి.

"హమ్మయ్య నేను బాగానే చెప్పాను. నీకూ సరిగ్గానే అర్థం అయ్యింది. నీ తల్లిదండ్రులు పుణ్యంకొద్దీ, నీ పెళ్ళాం పిల్లలు చేసుకున్న అదృష్టం... ఇంత తెలివైనవాడివి దొరికావు వాళ్ళకి!" అంటూ అతని మొహం చుట్టూ చేతులు తిప్పి మెటికలు విరుచుకుంది.

"మీరేమైనా చెప్పేది ఉందా" అని శాస్త్రిగారు వైపు చూసి... ఆయన ఏం చెప్పరని అర్థం అయ్యి... "వెళ్ళొస్తానని... అవసరం ఐతే ఒకసారి స్టేషనుకు వచ్చి రిపోర్ట్ ఇవ్వవలసి ఉంటుందని చెప్పి"... అక్కడి నుండి ఆ పోలీసాఫీసరు వెళ్ళిపోతుంటే...

"ఒక్క క్షణం నాయనా... ఇంకో విషయం చెప్పడం మర్చిపోయాను. మా మావయ్యగారి సంవత్సరికానికి మేము ఇలాంటివి మొత్తం ఓ రెండువందల వరకు పంచి పెట్టాము. అన్నింటి మీదా అదే పేరు ఉంటుంది. మరి వాటిల్లో ఎక్కడిదైనా అయ్యుండొచ్చు కదా. ఏమో ఏం చెప్పగలం. ఏ పుట్టలో ఏ పాముందో... ఎవరికి తెలుసు!" అంటున్న ఆవిడకు దండం పెట్టి అతను వెళ్ళిపోయాడు.

***

అతను వెళ్ళిపోయిన తర్వాత తన వైపే చూసి ముసిముసి నవ్వులు నవ్వుతున్న ఆవిడ బుగ్గమీద చిన్నగా తట్టి... "ఇన్ని తెలివితేటలు ఎక్కడివి" అంటున్న ఆయన వైపు చూడకుండానే...

"మరే... మీరు బడి లోపల చదువుకుంటే... మేం బడి బయట చదువుకున్నాం. ఐనా ఉపాయం లేనోడిని ఊరు నుండి పంపేయాలి అన్నారు. మీరేమో పేరుకే డాక్టరు .. కానీ, నోట్లోంచి మాటరాదని నాకు తెలియదా! అలాగే ఊరుకుంటే ఈ పాటికి పోలీస్టేషన్ మెట్లు ఎక్కవలసి వచ్చేది!" అంటూ చెప్పుకుని పోతున్న ఆవిడని గట్టిగా హత్తుకుని అలాగే ఉండిపోయారు.

**O**



# ఆ ఒక్కరే మనమంతా....!!

## ఎం. ఎ. పద్మనాభరావు

తూరుపు దిక్కున ఉదయ భానుడు తన తేజోవంతమైన కిరణాలతో చీకటిని ఛేదిస్తున్నాడు. ఆకుపచ్చ ఓణితో అందమైన ఆడపిల్లలా పంటపొలాలతో రెపరెపలాడుతున్న వజ్రాపురం ఆ నులి వెచ్చని వెలుగులలో స్నానమాచారిస్తోంది. కానీ ఆ గ్రామానికి ఒక విపత్తు రూపంలో వస్తున్న చీకటి తమ జీవితాలను ముసురుకుంటోందని తెలియని ఆ గ్రామ రైతులు, పొలం పనులకు సమాయత్తమౌతున్నారు. వజ్రాపురం మహానగరానికి చేరువలో ఓ గ్రామం.

ఊళ్లోకి వెళ్ళే రహదారికి అటూ ఇటూ పచ్చని చేలు. కొంచెం ముందుకెళ్తే రహదారికి అనుకుని ఆ వూరి త్రాగు నీటి అవసరాలు తీరుస్తూ ఓ చెరువు, ఆ చెరువు గట్టుపై రావి చెట్టు. చెట్టు చుట్టూ సిమెంటు గట్టు. పగలు రచ్చబండ, సాయంత్రం ఊరి కుర్రకారుకి మీటింగ్ అడ్డా.

***

"ఒక దేశ అభివృద్ధి, ఆ దేశంలో ఉత్పత్తయ్యే విద్యుత్ పై ఆధారపడి ఉంటుంది. ప్రైవేటు రంగంలో విద్యుత్ కర్మాగార నిర్మాణాలకు ఎక్కువ ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ ప్రభుత్వం అధిక శాతం నిధులను ఆ రంగానికి బడ్జెట్లో కేటాయించింది. మన రాజధానికి చేరువలో నున్న మీ గ్రామం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే తరుణం వచ్చింది. ఇక్కడ ఓ విద్యుత్ కర్మాగార స్థాపనకు ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అవసరమైన అనుమతులన్నీ పొంది, ఒక కార్యాచరణ రూపొందించిందని చెప్పడానికి ఆనందంగా ఉంది!" ఆ జిల్లా మంత్రైన వరహాలరావు రచ్చబండ కార్యక్రమంలో ఉపన్యసిస్తున్నాడు.

గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ పెట్టించమని ఎన్ని మార్లు మొరపెట్టుకున్నా వినని మంత్రి వరహాలరావు, ఈ రోజు ఏకంగా విద్యుత్ కర్మాగార స్థాపనకు నడుం బిగించాడంటే, దాని వెనుక ఏదో దురాలోచన ఉండి వుంటుందని ఆ గ్రామ యువ రైతులకు అనుమానం కలిగింది.

వారు ఊహించినట్టే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ తమ ప్రభుత్వమే కావడంతో విద్యుత్ ఉత్పత్తి కర్మాగార నిర్మాణానికి తన బంధువర్గం చేత టెండర్ వేయించి, అది తన వర్గానికే వచ్చేలా పావులు కదిపాడు వరహాలరావు. కర్మాగారానికి అవసరమైన అనుమతులుంటే ఏ ప్రైవేట్ సంస్థనో, విదేశీ సంస్థనో భాగస్వామిగా చేర్చుకుని నిర్మాణం పూర్తి చేస్తే డబ్బుకు డబ్బు, వాటాకు వాటా లభిస్తుందని అతని దురాలోచన. తన పలుకుబడిని, హోదాని ఉపయోగించి పనులు, ఫైళ్ళు వేగంగా కదిలేలా చూసాడు. ఇంకేముంది భూసేకరణ చట్టం క్రింద రైతులందరికీ నోటీసులు జారీ అయ్యాయి. భూసేకరణ మొదలయ్యింది. పచ్చగా కళకళలాడుతున్న ఊరిని, కళావిహీనమైన అనాధ స్త్రీగా మార్చడానికి రంగం సిద్ధమయ్యింది.

***

ఆ ఊళ్ళో మంచికి, చెడుకి విచక్షణతో, వివేకంతో అలోచించి అందరికి సలహాలిస్తూ పెద్దమనిషిగా గౌరవింపబడుతున్నవారు అవధాని మాష్టారు, ఆయన భార్య చంటమ్మ. గ్రామంలో వేగంగా జరుగుతున్న పరిణామాలను ఆ ఊరి రైతులు ఆయనకు విన్నవించారు.

మాష్టారుగారి సలహాతో మంత్రిగారిని మరొక్కసారి కలసి వినతిపత్రాన్ని సమర్పించిన రైతులు, “దొరా కడుపు నింపే భూములు పోగొట్టుకుని, కళ్ళ నిండా దుమ్ము కొట్టే ఆ కర్మాగారం మాకొద్దు” అని మొరపెట్టుకున్నారు.
“ఎంతో ప్రయాసపడి ఈ కర్మాగారాన్ని మన గ్రామానికి తెచ్చాను. ఇప్పుడు మీరంతా కర్మాగారం వద్దు అంటున్నారు. మరొక్కసారి ఆలోచించండి. భూములు కోల్పోతున్నామన్న బాధను మరచి మన ఊరు, మన రాష్ట్ర అభ్యున్నతికి పాటుపడండి. మీ అందరికి అధిక నష్టపరిహారం ఇప్పించే బాధ్యత నాది. అంతేకాదు భూమి కోల్పోయిన కుటుంబంలో ఒక్కరికి కర్మాగారంలో ఉపాధి కల్పించేలా కృషి చేస్తానని హామీ కూడా ఇస్తున్నాను.” వినయంగా వారికి నచ్చ చెప్పారు.

మంత్రిగారి వినయం వెనుక విషమెంతుందో గ్రహించని రైతులు, అవధానిగారి మాటను పెడచెవిని పెట్టి , తమ పొలాలను ఆ భూబకాసురుల పరం చేయడానికి ఒప్పుకున్నారు. మంత్రిగారి మంత్రాంగంతో ఖంగుతిన్న యువ రైతులు అవధాని మాష్టారి అధ్వర్యంలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. తల్లిని పిల్లని వేరుచేసినట్లుగా ఊరి జనానికి, పంట పొలాలకి మధ్య ముళ్ళకంచె పడింది.

***

విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అవసరమయ్యే వాహనాలు, యంత్రాలు రాకపోకలకి వీలుగా రోడ్డు విస్తరణకు చెరువు అడ్డురావడంతో దాన్ని పూడ్చడానికి అధికారులు నిర్ణయించి తుపాకులు చేత బట్టిన పోలీసులను మోహరించారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా మాష్టారు ఆమరణ నిరాహార దీక్ష మొదలు పెట్టారు. ఆ చెరువు గట్టునే దీక్షా శిబిరం ఏర్పడింది. ప్రజలందరూ మాష్టారు గారికి అండగా కదిలారు.

“ఈ జీవ ధాత్రి మా కన్నతల్లి. ఈ తల్లినే నమ్ముకున్న బిడ్డలమే గాని, ఆ అమ్మను అమ్ముకునే బిడ్డలం కాదు. మా జీవన్మరణాలు ఈ నేలతో ముడిపడున్నాయి. పర్యావరణాన్ని కలుషితం చేసి, పచ్చని ప్రకృతిని హరించే కర్మాగారాలేవి మాకొద్దు” నినాదాలతో ఉద్యమం హోరెత్తింది.

ఉద్యమానికి పర్యావరణ వేత్తలు, మేధావులు బాసటగా నిలిచారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు రంగంలోకి దిగి మద్దతు పలికాయి. మాష్టారు దీక్ష మొదలుపెట్టి మూడో రోజులయ్యింది. జిల్లా నలుమూలల నుంచి అనూహ్యమైన మద్దత్తు ఉద్యమానికి లభించే సరికి మంత్రిగారి వర్గం ఖంగుతింది. ప్రభుత్వం సంప్రదింపుల పర్వానికి తెర దింపింది.

“మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తు సరిపోక, పొరుగు రాష్ట్రాలనుంచి అధిక ధరతో కొనుగోలు చేస్తున్నాం. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్తును సరఫరా చేయాలంటే ఇటువంటి కర్మాగారాలెన్నో నిర్మాణం చెయ్యాలి. ప్రజల అవసరాలను గమనించి నిర్ణయాలను తీసుకోవాల్సింది ప్రభుత్వం. మీరు వృద్ధులు, విద్యావంతులు, దయచేసి ఈ మంచి ప్రయత్నాన్ని, రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలను అడ్డుకోవద్దు. భవిష్యత్తుని అలోచించి, మీ ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని దీక్షని విరమించుకోండి” అధికారులు మాష్టారుని కోరారు.

“ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకునే అధికారాన్ని మాకొదిలిపెట్టండి. ప్రభుత్వ ఆశయాలు మంచివే కావచ్చు. కానీ అవి అమలుచేసే పద్ధతే బాగోలేదు. విద్యుత్ కర్మాగారానికి పచ్చని పంట భూములే కావాలనడం వెనుక మీ అసలు ఉద్దేశం ప్రజలకు తెలియంది కాదు. ప్రభుత్వ బంజరు భూములెన్నో ఉన్నాయి. అక్కడ ఈ నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. నా ఆరోగ్యం కన్నా ఊరి ఆరోగ్యమే నాకు ముఖ్యం. ప్రభుత్వం కర్మాగార నిర్మాణ ప్రతిపాదనను ఉపసంహరించే వరకూ దీక్ష విరమించేది లేదు” మాష్టారు నిక్కచ్చిగా చెప్పారు.

***

చర్చలు విఫలమయ్యాయి. ప్రభుత్వ అధికారులు మొండిగా చెరువును పూడ్చడానికి సిద్ధమయ్యారు.

పెద్ద చదువులు చదివినా ఉద్యోగాల ఊసే ఎత్తక వ్యవసాయంతో మరో పదిమందికి ఉపాధి కల్పించవచ్చుననే సదాశయంతో భూమిని నమ్ముకున్న యువ రైతులకు ప్రభుత్వ చర్యలు అశనిపాతమయ్యాయి. అవధాని మాష్టారుతో పాటు ఆ యువ రైతులు యంత్రాలకు అడ్డంగా పడుకున్నారు. పోలీసులు లాఠీలతో వారందరినీ చెదరగొట్టారు. దాంతో అణచి పెట్టిన ఆగ్రహం వరదై, తిరుగుబాటు ప్రవాహమై వారిని హింసకు ప్రేరేపించింది. పోలీసులపైన, అధికారులపైన రాళ్ల వర్షం కురిపించారు. రక్షణ చర్యలుగా ఆందోళనాకారులపై పోలీసులు బాష్పవాయువు ను ప్రయోగించినా ఫలితం లేకపోయింది.

ఇదే అదనుగా సంఘ విద్రోహ శక్తులు ఉద్యమంలో చేరి యంత్రాలకు, ప్రభుత్వ వాహనాలకు నిప్పుపెట్టారు. ప్రజాగ్రహం ఉప్పెనలా పోలీసులను, ప్రభుత్వ అధికార్లను చుట్టుముట్టింది. పోలీసులు కాల్పులు జరిపారు. అవధాని మాష్టారిని పోలీసు తూటా బలికొంది. అయన నేలకొరిగారు. ఆందోళనకారుల ఆగ్రహావేశాలకు ఊరు క్షణంలో అగ్నిగోళమయ్యింది.

మాష్టారి మరణవార్త దావానలంలా జిల్లా మొత్తం ప్రాకిపోయింది. ప్రజాగ్రహ జ్వాలల్లో ప్రభుత్వ ఆస్తులు దగ్ధమయ్యాయి. హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని చక్కదిద్దడానికి రాష్ట్రప్రభుత్వం మరిన్ని పోలీసు బలగాలను దింపి ప్రశాంతత నెలకొనేలా చర్యలు చేపట్టింది. నెమ్మదిగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

***

నాయకత్వలేమితో ఉద్యమం అణగారి పోతుందనుకున్న మంత్రి అనుయాయులకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది.

“కడుపున పుట్టిన పిల్లలు కన్నతల్లినే అనాదరణతో వీధుల పాల్జేస్తున్న ఈ రోజుల్లో, కడుపులో దాచుకునే నేల తల్లిని కసాయి చేతుల నుంచి, కాలుష్యం కోరల నుంచి కాపాడడానికి ప్రాణాలర్పించిన ధన్యజీవి మన అవధాని మాష్టారు. భవితకు, యువతకు దిశానిర్దేశం చేసిన ఆ మహామనిషి ఆత్మకు జోహార్లు అర్పిద్దాం. తన జీవాన్ని, సర్వస్వాన్ని మనకు పంచుతూ బదులుగా ఏమాత్రం ప్రతిఫలాన్ని ఆశించని పూజ్యనీయురాలైన మాతృభూమిని, కాలుష్య రాకాసి విషపు కోరల నుండి రక్షించేవరకూ ఈ పోరాటం సాగిద్దాం. మాష్టారి ఆశయం సాధించేవరకు ఉద్యమాన్ని విరమించేది లేదని ప్రతిజ్ఞ పూనుదాం. అంతిమ విజయం మనదే...

ఒక్కరే విజయాన్ని సాధించగలరు. ఆ ఒక్కరే మనమంతా....”

భర్తను కోల్పోయినా వెరవక నాయకత్వ బాధ్యతలను స్వీకరించి  ఉద్యమాన్ని విజయ తీరాలకు చేర్చడానికి నడుం బిగించిన శ్రీమతి చంటమ్మ ఉత్తేజ పూరిత ప్రసంగం మాతృభూమి పరిరక్షణకై మరో మాతృమూర్తి పూరిస్తున్న శంఖారావంలా ప్రతిధ్వనిస్తోంది. రెట్టించిన ఉత్సాహంతో కడలిలా పొంగుతోంది ప్రజా ఉద్యమం. ఆ ఉత్సాహాన్ని కనులార తిలకించిన భానుడు పడమటి దిక్కుకు పయనమవుతున్నాడు.

**0**

కథా మంజరి



# స్నేహమా...?

భాగవతుల భారతి

'ఏంచేయాలీ? వెళ్ళాలా? వద్దా? పాతిక సంవత్సరాల నాటి స్నేహం. ఎవరిని ఓదార్చాలి నేనిప్పుడు వెళ్ళీ!' గతంలోకి తొంగిచూస్తూ ఆలోచిస్తున్నాను.

***

నేను డిగ్రీ చదివే రోజులు. ఉన్న అద్దెఇల్లు ఇరుకుగా ఉన్నదని, నాన్న, అమ్మ పిల్లలమైన మా ముగ్గురితో సంసారాన్ని వేరే ఇంటికి మార్చారు. చక్కటి ఇల్లు, వాతావరణం బాగుంది, దానికి తోడు, ఎదురింట్లో ఓ మామ్మగారూ, ఆమెకు కూతురు చనిపోతే, తన ముగ్గురు మనుమలూ మనుమరాళ్ళతో కలసి ఉంటుంది.

వాళ్ళతో పరిచయం, కాలక్షేపం బాగుంది. ఐతే మేం వెళ్ళిన రెండేళ్ళలోనే మామ్మగారి మనుమరాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోయాయి, ఇక మిగలింది రామ్! అతను బ్యాంక్ లో పనిచేస్తున్నాడు. ఓ మోస్తరు అందం. మా ఇద్దరికీ స్నేహం ఏర్పడింది. బ్యాంక్ నుండి రాగానే రామ్ మా ఇంట్లో వాలిపోయి, నాన్నగారితో మాటల్లోకి దిగేవాడు. నేనూ అప్పటికి కాలేజీనుండి వచ్చేసి వాళ్ళ సంభాషణలలో కలిసేదాన్ని. నాతో చనువుగానే ఉండేవాడు.

రోజులు జరిగిపోతూనే ఉన్నాయి. రామ్ ని పెళ్ళి చేసుకోమని, మామ్మగారు తెగ పోరు పెడుతూండేది.

"మీ అమ్మ పోతే, మీ నాన్న రెండో పెళ్ళి చేసుకుని మిమ్మల్ని గాలికి వదిలేస్తే, మిమ్మల్ని పెంచి పెద్ద చేశాను. ఇక నాకూ వయసై పోతోంది, ఓపిక కూడా లేదురా! నువ్వో ఇంటివాడ్ని చేసేస్తే, నాకే చింత ఉండదు!" అని పోరుతుండేది.

ఆ కుటుంబంతో స్నేహం వల్ల, నాన్న అమ్మకూడా సలహాలు ఇచ్చేవారు. రామ్ కీ నాకూ, మధ్య స్నేహం మరింత బలపడింది. మా మధ్య వయసులో పదేహేను సంవత్సరాల తేడా ఉంది. తన మనసులో ఏముందో' తెలీదుగానీ, నిరంతరమూ, మాతోనే ముచ్చట్లూ, ముఖ్యంగా నాతో ఎన్నో కబుర్ల కలబోతలు ఉండేవి. రోజులు మారి తనకు ఓ చక్కటి అమ్మాయితో పెళ్ళయింది. ఇంకా బలపడింది మా స్నేహం.

రామ్ భార్య లక్ష్మి కలుపుగోలు మనిషి. పలకరిస్తూనే ఉండేది. ఆ తర్వాత కొద్ది రోజులకే నాపెళ్ళీ కూడా అయింది. వాళ్ళిద్దరు ఆ పెళ్లి దగ్గరుండి జరిపించారు. మరో పది రోజులకు రామ్ ప్రమోషన్ మీద మెదక్ బదిలీ అయింది.

“తప్పదు.. వెళ్ళాలి! మిమ్మలందరిని వదిలి వెళ్ళాలంటే కష్టమే.. కాని తప్పదు! తప్పకుండ ఫోను చేస్తూ ఉంటాను. మాళవికా.. ఎలాగూ నువ్వు హైదరాబాద్ లోనే ఉంటావు కదా, అప్పుడు నువ్వు మా ఊరు రావొచ్చు!” అంటూ అందరి దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయారు రామ్ దంపతులు.

స్నేహితుల్లా విడిపోయాం. నేను కాపురానికి హైదరాబాద్ వెళ్ళిన తర్వాత, రామ్ విషయాలు నాన్నగారి ద్వారా తెలిసేవి. ఇద్దరం అలా జీవన యాత్రలో పడిపోయాం. పది సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇల్లు, పిల్లలు, సంసారం.. వీటిలో పడిపోయి రామ్ సంగతులు కూడా తెలుసుకునే సమయం ఉండేది కాదు. అమ్మా నాన్నలతో మాట్లాడినప్పుడు కూడా రామ్ ప్రస్తావన వచ్చేది కాదు.

ఆరోజు.. తెలియని నంబరు నుంచి ఫోన్ వస్తే, “ హలో ఎవరు?” అంటూ అడిగాను.

“నేను. రామ్ ని!” ఆ మాటలు వినగానే ఒక్కసారి తెలియని ఆనందం వచ్చింది.

“ఎలా ఉన్నారు, ఎక్కడ ఉన్నారు?” అంటూ ప్రశ్నలు కురిపించాను.

“ప్రస్తుతం బానే ఉన్నాను! కాని.. ఓ ఏడాది క్రితం ఆక్సిడెంట్ జరిగి, ప్రాణం పోవలసిందే! కాని మన స్నేహానికి ఇంకా ఆయుషు ఉన్నట్టుంది! కాలు తీసేసారు. మన ఊరు వచ్చేసాం..” అంటూ ఆక్సిడెంట్ ఎలా జరిగిందో వివరంగా చెప్పాడు.

ఒక్కసారి షాక్ అయ్యాను. తేరుకుని "పోనీలే లక్ష్మిగారు, మీ పిల్లల అదృష్టం!" అన్నాను.

ఆ రోజంతా అన్యమనస్కంగానే ఉన్నాను. ఏవో.. ఆలోచనలు చుట్టుముట్టాయి.

‘అతను ప్రత్యేకించి నాకు ఫోన్చేసి ఎందుకు చెప్పినటట్టు?’ ఈ ప్రశ్న నన్ను కుదుపిసింది!

పిల్లలకి నాలుగు రోజులు స్కూలు సెలవులు వస్తే, వాళ్ళని తీసుకుని మా ఊరు వెళ్ళాను. ఆ రోజు సాయంత్రమే పిల్లల్ని ఇంట్లో ఆడుకోమని చెప్పి, రామ్ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. రామ్ ని ఏ పరిస్థితి లో చూడాల్సింది వస్తుందో అని భయపడ్డాను. కానీ అప్పటికే జైపూర్ కృత్రిమకాలు పెట్టుకుని, బానే ఉన్నాడు.

'ఆకస్మిక వైకల్యం వల్ల ఏర్పడిన డిప్రెషన్ లో ఎదోలాఉన్నాడు. ఇంట్లో తన స్థానం తారుమారై ఆ పరిస్థితిని నాకు ఏమాత్రం తెలియకూడదను కుంటూనే 'నా భుజం ఆసరా కోసం తాపత్రయ పడుతున్నాడని' రామ్ మాటల్లో అనిపించింది. వాళ్ళింట్లో కూడా ఎవరికీ ఈ స్నేహం విషయం తెలియకూడదనీ, వాళ్ళ ఇంట్లో వాళ్ళ వివరాలు ఎప్పుడో తప్ప ముచ్చటించేవాడు కాదు. ఉన్న నాలుగు రోజుల్లో అతనిలో మరో మనిషిని చూసాను.

అప్పట్లో నేనంటే ఇష్టపడినట్లూ, ఇద్దరి మధ్య వయసు తేడా వలన, ఇంట్లోవాళ్ళు ఏమంటారో అని బయట పెట్టలేక పోయిన విషయాలన్నీ, రామ్ నోట్లో నుండి బయటికి వచ్చాయి. కానీ తన మీద నాకు సానుభూతి పోలేదు. తర్వాత నేను హైదరాబాదు తిరిగి వచ్చేసాను. ఏవేవో మెస్సేజ్లు పంపేవాడు. ఒకసారి హద్దుల్లో ఉండమని హెచ్చరించాను. అయిన సరే, తనలో తరచుగా ప్రేమికుడు నిద్రలేవటం జీర్ణించుకోలేక పోయాను. "కేవలం ఆరోగ్యకరమైన స్నేహమైతేనే ఓకే. మిగిలిన అనవసరమైన విషయాలు నాతో వద్దని వదిలేయమనీ" ఫోన్ చేసి చాలా వార్నింగ్ ఇచ్చాను. వెంటనే కొంత అలిగి దూరం జరిగి మళ్ళీ దగ్గరవుతూ, నాచేత తిట్లు తింటూ, ఉండేవాడు. ఇక ఉపేక్షించడం నావల్ల కాలేదు. సెల్ లో అతని నెంబర్ తీసివేసాను. కానీ ఫోన్ చేసి, బ్రతిమాలి, కేవలం స్నేహంగానే మాటా ముచ్చటా అనీ ఒప్పించాడు. మళ్ళీ ఓ ఆసరా కోసం తాపత్రయం... ఐతే ఆ సమయంలో తను అన్నమాట నా మనసుని కలిచివేసి మౌనంగా నోరు విప్పలేకుండా చేసింది.

"మాళవికా! నేనేది వాగేదీ నీతోనేగా!వాగుడేగా! అంతకుమించి కుంటు కుంటూ వచ్చి, నిన్నేం చేయనుగా! ఇన్ని సంవత్సరాలుగా చూస్తున్నావ్ నీకు అపకారం చేస్తానా?"

ఆ మాటలు వింటూనే గిల్టీగా ఫీలయ్యాను. తన ఆరాటం తట్టుకోలేక, "ఓ సారి రానా!వచ్చి కనిపించనా?" అని అడిగాను. మనసు విప్పి మాట్లాడితే కొన్ని స్నేహాలు అక్కడితో ఆగుతాయి.

"మాళవికా! ఈ ఇంట్లో మనిద్దరికీ సంబంధించిన చాలా జ్ఞాపకాలున్నాయి! ఎప్పటికీ, అప్పటి నా మాళవిక రూపమే మనసులో మెదులుతూనే ఉంటుంది. ఆ చిత్రం అలాగే ఉండాలి. నువ్వు రావద్దు!" అన్నాడు. మనసు కలిచి వేసింది.

ఈ నేపధ్యంలోనే తన ఇద్దరు పిల్లలకీ పెళ్ళిళ్ళు చేసాడు.  కానీ నేను వెళ్ళలేకపోయాను. కానీ ప్రతీక్షణం తన ధ్యాస, ధ్యానం నేనే కావటం మంచైనా చెడైనా నేను ఎంతో ఓపికతో  తట్టుకున్న విషయం... ఇవన్నీ మా వారితో సర్ది చెప్పేసుకుని, స్నేహం కొనసాగించడం మంచిదేమో అనుకున్నాను. దీన్ని సాహస స్నేహం, అనాలా? త్యాగ స్నేహం అనాలా?  ఓ ఆడపిల్లగా ఇలాంటి స్నేహాలకి నేను పూర్తి వ్యతిరేకం.  కానీ, తానున్న పరిస్థితి లో, మెంటల్ బాలెన్స్ కోల్పోయి ఆత్మహత్య చేసుకుంటే? ఒక్కసారి భయం వేసింది! అలా మౌనంగా ఉండిపోయాను.


ఉన్నట్టుండి ఆ రోజు ఫోన్ వచ్చింది.

"నమస్కారం అండి! నేను విజయవాడ నుండి మాట్లాడుతున్నాను. నేను రామ్ గారి పెద్దబ్బాయిని! మీరెవరో, నాకు తెలీదండీ, గాని నాన్నగారి సెల్ లో తను ఆకస్మికంగా మరణిస్తే,  తెలియజేయాల్సిన ఏకైక నెంబర్ అని ఈ నెంబర్ ఫీడ్ చేసి ఉంది.  నాన్నగారు రాత్రిపోయారు!" ఇంకా ఆ మాటలు వినబడలేదు.

ఏదో ఊపిరాడక, ఉక్కిరిబిక్కిరి అయిన భావన.  తాను మరణిస్తే, తెలియజేయాల్సిన ఏకైక నెంబర్ గా నోట్ చేసుకున్నాడంటే,  నాకు తెలియకుండానే, ఓ మనిషికి ఓదార్పునయ్యానా? తన కష్టంలో ఓదార్పునయ్యానా? భుజం ఆసరాగా ఇచ్చానా? లేక ఎన్నోసార్లు బాధపెట్టానా? స్నేహమేనా? అన్నీ కలగలిపిన మరోటా?

ఇప్పుడు నేను వెళ్ళాలా? ఆలోచిస్తున్నాను.

**O**



# తల్లిదీవెన

శ్రీ శేష కళ్యాణి గుండమరాజు

శనివారం సాయంత్రం జాహ్నవి తన ఆఫీసులో పని ముగించుకుని, రోజూకన్నా కొంచెం త్వరగా ఇంటికి వెడదామని బ్యాగ్ ని భుజాన వేసుకుంది. అంతలో తన బల్లపైనున్న ఫోన్ మోగింది. అది తన బాస్ వినయ్ నుండీ వచ్చిన కాల్ అని తనకు తెలుసు.

తప్పనిసరిపరిస్థితులలో భయంగా ఫోన్ ఎత్తి, "హలో..!", అంది జాహ్నవి.

"హలోబ్యూటీ..! గుర్తుందిగా? వచ్చేవారం మన విభాగానికి సుగుణగారు వస్తున్నారు. ఆవిడతో మనకు కీలక సమావేశం! ఈ సంస్థలో నీ భవిష్యత్తు ఏమిటో తెలిసేది అప్పుడే! సోమవారం త్వరగా వచ్చేయ్. అయినా రాకుండా ఎటు పోతావులే?! నా బుజ్జి స్వీటీ!" మంద్రస్థాయి స్వరంలో వెకిలిగా నవ్వుతూ అన్నాడు వినయ్.

జాహ్నవికి ఒళ్ళుమండి ఠప్పున ఫోన్ పెట్టేసి, వేగంగా ఆఫీస్ బయటకొచ్చి, ఆటోలో ఇంటికి చేరుకుని, బ్యాగ్ ని సోఫాలో పడేసి అక్కడున్న వాలుకుర్చీలో నీరసంగా కూర్చుంది. ఎంతవద్దనుకున్నా వినయ్ మాటలు, చేష్టలు తనకు పదేపదే గుర్తుకొస్తున్నాయి. జాహ్నవి స్వతహాగా ధైర్యస్తురాలే అయినప్పటికీ వినయ్ వ్యవహారం తనకెందుకో భయం కలిగిస్తోంది.

ఒక చిన్న గ్రామంలోని నిరుపేద కుటుంబంలో పుట్టిన జాహ్నవిని, ఆమె తల్లి సీతమ్మ, తండ్రి వెంకయ్యలు ఎన్నో కష్టాలకోర్చి చదివించారు. చదువు పూర్తి చేసిన జాహ్నవి, పట్నంలోని ఒక ప్రముఖ సంస్థలోఉద్యోగాన్ని సంపాదించింది. జాహ్నవి పనితీరు నచ్చడంతో, ఆ సంస్థవారు ఆమెకు ఒక ముఖ్యమైన పనిని అప్పజెప్పి వినయ్ బృందంలో వేశారు. తన పనికి అవసరపడే కొత్త అంశాలను సాధ్యమైనంత త్వరగా నేర్చుకోవాలని, ఎక్కువ సమయం ఆఫీసులోనే గడిపేది జాహ్నవి. మొదట్లో జాహ్నవితో వినయ్ చాలా మర్యాదగా మాట్లాడేవాడు. జాహ్నవి పేదకుటుంబం నుండీ వచ్చిందనీ, ఒంటరిగా ఉంటోందని తెలిసినప్పటి నుండీ అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. జాహ్నవికి ఆ ఉద్యోగం ఎంత అవసరమో గ్రహించి, ఆ అవసరాన్ని తనకు

లభించిన అవకాశంగా వాడుకుంటూ, ఆమెను వేధించడం మొదలుపెట్టాడు వినయ్! గంటగంటకీ తన కేబిన్‘కు ఏవేవో ఫైల్స్ తీసుకురమ్మని చెప్పి, అవి అందుకునే నెపంతో జాహ్నవి చేతులను తాకేవాడు. జాహ్నవికి ఒళ్ళు జలదరించి విపరీతమైన కోపం వచ్చేది. అప్పుడప్పుడు వినయ్ జాహ్నవిని మాత్రమే సమావేశమంటూ పిలిచి అసభ్య పదజాలంతో ఇబ్బంది పెట్టేవాడు. అటువంటి సంఘటనలు జాహ్నవికి బాధ కలిగించేవి. కానీ, వినయ్ జాహ్నవి పనితీరు గురించి నివేదిక ఇవ్వవలసిన అధికారి! అందువల్ల, అతనిపై ఎవరికీ ఫిర్యాదు చెయ్యలేక, వినయ్ ఆగడాలను మౌనంగా భరిస్తూ వచ్చింది జాహ్నవి. అన్ని విషయాలూ తల్లితో పంచుకునే జాహ్నవి, వినయ్ విషయం మాత్రం ఇంకా సీతమ్మకు చెప్పలేదు. అలా చెప్తే పట్నంలో ఒంటరిగా ఉంటున్న తన మీద సీతమ్మ బెంగ పెట్టుకుని ఆరోగ్యం పాడుచేసుకుంటుందని జాహ్నవికి భయం!

సోమవారం మధ్యాహ్నం జాహ్నవికి, తమ విభాగానికి అధ్యక్షురాలైన సుగుణతో, వినయ్ సమక్షంలో సమావేశం ఉంది. అందులో జాహ్నవి పనితీరును సుగుణ పరిశీలించి, జాహ్నవి పదోన్నతికి అర్హురాలయ్యేది లేనిదీ నిర్ణయిస్తుంది. జాహ్నవి పదోన్నతి సంపాదించగలిగితే తన తల్లిదండ్రులను పట్నం తెచ్చుకుని తన దగ్గరే ఉంచుకోవచ్చు!

వాలుకుర్చీలో కూర్చున్న జాహ్నవి, వినయ్ తలపుల నుండీ తన మనసును మరల్చుకునేందుకు టీ.వీ. ఆన్ చేసి, వార్తలు చూస్తూ ఉండగా, ప్రభుత్వంవారు కరోనావైరస్ కారణంగా దేశమంతటా లాక్-డౌన్ ప్రకటించి కార్యాలయాలన్నీమూసివేశారన్న సంగతి జాహ్నవికి తెలిసింది. వెంటనే జాహ్నవి తన లాప్-టాప్ తీసి ఇ-మెయిల్చూసింది. అప్పటికే జాహ్నవి పనిచేస్తున్న సంస్థవారు తమ ఉద్యోగులంతా సోమవారంనుండీ ఇంటినుండే పని చెయ్యాలనీ, అన్ని సమావేశాలూ ఆన్-లైన్‘లోనే జరుగుతాయని చెప్తూ ఆదేశాలు జారీ చేశారు. జాహ్నవి మనసు కొంచెం తేలిక పడింది. తను వినయ్‘ను కొంతకాలం కలవాల్సిన అవసరం లేదు! వినయ్ వేధింపులనుండీ తను కొద్దిరోజులు కచ్చితంగా తప్పించుకున్నట్లే అని అనుకుంది జాహ్నవి.

సోమవారం ఉదయం లాప్-టాప్ ముందు కూర్చున్న జాహ్నవి, సంస్థనుండీ వచ్చిన ఇ-మెయిల్స్ చూసుకుంటూ ఉండగా వినయ్ కాల్ వచ్చింది.

"హలోజాహ్నవీ! ఇవాళ్టి కార్యప్రణాళిక సిద్ధం చేద్దామా?" అడిగాడు వినయ్.

తను అనుకున్నట్లే వినయ్ మర్యాదగా పలకరించడంతో ఇక అతడివల్ల తనకెలాంటి ఇబ్బందీ లేదనుకుని, "అలాగే సర్!" అందిజాహ్నవి.

"సర్ ఏంటీ అసహ్యంగా? డియర్ అను బ్యూటీ..!" అన్నాడు వినయ్.

జాహ్నవి అదిరిపోయింది.

"నా భార్య పుట్టింటికెళ్లింది. ఈ లాక్-డౌన్ ఎత్తేదాకా నీలాగా నాక్కూడా ఏకాంతమే! మనం ఎప్పుడంటే అప్పుడు సరదాగా మాట్లాడుకోవచ్చు! ఏమంటావ్ స్వీటీ?" అడిగాడు వినయ్.

జాహ్నవికి భయంతో పాటూ కోపం కూడా వచ్చింది!

"వద్దు సర్..! దయచేసి మనం ప్రొఫెషనల్'గానే మాట్లాడుకుందాం!" వణుకుతున్న కంఠంతో ప్రాధేయ పడుతున్నట్లుగా చెప్పింది జాహ్నవి.

"నోర్ముయ్! నీ పిలక నా చేతుల్లో ఉంది! నీ గురించి సుగుణ గారికి నేను చెడ్డగా చెప్పి, నీ ఉద్యోగం ఊడేలా చెయ్యగలను! ఈ కరోనాకాలంలో నీకు మరెక్కడా ఉద్యోగం దొరకదు! నువ్వు మీ ఊరెళ్ళి మళ్ళీ బీద బతుకు బతకాల్సి వస్తుంది! జాగ్రత్త !" అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతూ జాహ్నవిని బెదిరించాడు వినయ్.

వినయ్ ఆడిన పరుషపు మాటలకు జాహ్నవి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఆ మరుక్షణం కాల్ ఎండ్ చేసేసింది జాహ్నవి. ఏదోఒకటి చేసి అతడికి బుద్ధి చెప్పాలన్న ఆవేశం ఒక పక్కైతే, ఏమీ చెయ్యలేని నిస్సహాయత మరో పక్క!

'అమ్మ నా పక్కనే ఉంటే బాగుండు!' అని కుమిలిపోతున్న జాహ్నవి, తన ఫోన్ మోగేసరికి ఉలిక్కిపడి ఫోన్ వంక చూసింది. ఆ కాల్ సీతమ్మ నుండీ రావడం జాహ్నవికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎందుకంటే సీతమ్మ జాహ్నవి ఆఫీసు పని వేళల్లో ఎంతో అవసరమైతే తప్ప కాల్ చెయ్యదు!

"హలో అమ్మా!" అంటూ ఫోన్ ఎత్తింది జాహ్నవి.

"హలో తల్లీ..! నువ్వు ఏదో విషయంలో కంగారు పడుతున్నావు కదూ?" అడిగింది సీతమ్మ.

జాహ్నవి ఆశ్చర్యపోయి, "అబ్బే! ఏమీలేదే!" అంటూ విషయం దాచడానికి ప్రయత్నించింది.

"జాహ్నవీ! నేను నీకు అమ్మను. నువ్వు లోలోపల మథన పడుతున్నావన్న సంగతి నాకు నీ మాటలబట్టి అర్థమయింది. నీ గొంతులో ఎప్పుడూ ఉండే హుషారు, ఆనందం నాకు ఈమధ్య వినపడట్లేదు. ఆడపిల్లవు! పట్నంలో ఒంటరిగా ఉండటమంటే మాటలు కాదు! ఎట్టి పరిస్థితులలోనూ నువ్వు అధైర్యపడొద్దమ్మా! నీకెటువంటి కష్టమూ కలగకూడదని ఆ పరమాత్మని నేను ఎప్పుడూ వేడుకుంటూ ఉంటాను. నీ సమస్యకు

ఆ పరమాత్మ తప్పకుండా పరిష్కారం చూపిస్తాడు! నీకున్న ఆవేదన తొలగిపోయి విజయం కలగాలని మనస్ఫూర్తిగా నిన్ను నేను ఆశీర్వదిస్తున్నాను!" అంది సీతమ్మ.

తల్లి మాటలు జాహ్నవి లో మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి.

"అలాగే అమ్మా!" అంది జాహ్నవి.

"నా చిట్టి తల్లివి .. జాగ్రత్తమ్మా!" అంటూ ఫోన్ పెట్టేసింది సీతమ్మ.

'ఇక ఆలస్యం చెయ్యకూడదు! వినయ్ మీద ఫిర్యాదు చేసెయ్యాలి!' అని అనుకుంటూ జాహ్నవి సుగుణ నెంబర్'కి డయల్ చెయ్యబోతూ ఉంటే, అదే నెంబర్నుండీ తనకు కాల్ రావడం గమనించి ఆశ్చర్యపోయి, "హలో మేడం!" అంటూ ఫోన్ ఎత్తింది.

"హలో జాహ్నవి! ఎలా ఉన్నావ్? నువ్వు పడుతున్న బాధను నేను అర్థం చేసుకోగలను!" అనునయిస్తున్నట్టుగా అంది సుగుణ.

"అదీ .. మేడం .. మీకు బాస్ విషయం ..." సందేహిస్తూ ఆగింది జాహ్నవి.

"ఆ వినయ్ నిన్ను ఎలా ఏడిపిస్తున్నాడో నాకు ఈ రోజే తెలిసింది. వాడిని వెంటనే ఉద్యోగం నుండీ తొలగించమని ఆదేశాలు ఇచ్చాను. వాడు సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించాడు. వాడిపై తగిన చర్యలు తీసుకుంటాము!" చెప్పింది సుగుణ.

"కానీ మేడం .. మీకు వినయ్ సంగతి ఎలా తెలిసిందీ?" ఆశ్చర్యంగా అడిగింది జాహ్నవి.

"జాహ్నవీ! ఆన్-లైన్'లోజరిగే సమావేశాలన్నీ రికార్డు అవుతాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే, అయినా వినయ్ మర్చిపోయినట్టున్నాడు! అనుకోకుండా మీ సంభాషణను నేను వినడంవల్ల నాకు అతని గురించి తెలిసింది. ప్రతినెలా మీ విభాగంవారు చేసే పనిని నేను పునఃపరిశీలిస్తూ ఉంటాను. నువ్వు ఎంత బాగా పనిచేస్తావో నాకుతెలుసు! నీవంటి ప్రతిభావంతులకు మా సంస్థ తగిన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తుంది. నీ పేరు ఈ ఏడు పదోన్నతికి అర్హులైనవారి జాబితాలో తప్పక ఉంటుంది! ఆల్ ది బెస్ట్!" అంది సుగుణ.

"ధన్యవాదాలు మేడం!" అని చెప్పి, సెల్ ఫోన్ మీద తన తల్లి ఫోటోమీద గట్టిగా ముద్దు పెట్టుకుంది. దీవిస్తున్నట్లు ఉన్న ఆ ఫోటో చూస్తూ, ఆఫీసు పనిలో నిమగ్నమైపోయింది జాహ్నవి!

**O**



# క్లియరెన్స్

## ఎం బిందుమాధవి

ఆ కాంప్లెక్స్ ముందు క్యాబ్ దిగి లోపలకి వెళ్తుంటే, లహరిని గుర్తు పట్టి, కాంప్లెక్స్ సెక్యూరిటీ గార్డ్ "అమ్మా..బాగున్నారా? అమ్మగారు, నాన్నగారు కులాసాగా ఉన్నారా? ఎప్పుడొచ్చారు?" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు. లహరి తో పాటు ఉన్న భర్త మధు నవ్వుతూ "చూసావా.. నిన్ను ఎవరు మర్చిపోలేదు" అంటూ ఆమె వైపు చూసాడు.

అతనికి సమాధానం చెప్పి లిఫ్ట్ ఎక్కి ఫోర్త్ ఫ్లోర్ లో ఉన్న ఫ్లాట్ కి చేరి పాత తాళం కప్ప తీసి, దాన్ని మార్చాలని, అనుకుంటూ లోపలికి అడుగు పెట్టారు.

'పిల్లలొస్తున్నారు అనగానే తెల్లవారు ఝామున లేచి ఎయిర్‌పోర్ట్ కి వచ్చే నాన్న .. ఇంటి దగ్గర ఏర్పాట్లు చూస్తూ, లిఫ్ట్ డోర్ తీసిన చప్పుడు వినగానే పరుగెత్తుకొచ్చి దగ్గరకి తీసుకునే అమ్మ'.. ఇవేమీ లేకుండా తనే ఆ తలుపు తీసుకురావటం ఎక్కడో గుచ్చుకున్నట్టు అనిపించింది. లహరికి ఒక్కసారి కళ్ళల్లో సన్నటి నీటి పొర కమ్మేసింది.

తాళం తీసిన చప్పుడుకి ఎదురింటి శారద ఆంటీ, "ఎవరది" అంటూ వచ్చారు. లహరిని చూసి.. మేం వస్తున్నట్టు ముందే తెలిసినందువల్ల "అమెరికా నించి ఎప్పుడొచ్చారమ్మా? ప్రయాణం బాగా జరిగిందా? ఇక్కడే దిగవలసింది. కాఫీ తెస్తానుండు!" అని వెనక్కి తిరిగారు.

"మేము ఆబిడ్స్ తాజ్ హోటల్లో దిగాం ఆంటీ! మా బ్రేక్ఫాస్ట్ అయింది. శ్రమ తీసుకోకండి. లంచ్ లోపు కొంత సామాను సర్ది ప్యాక్ చెయ్యాలి!" అన్నది.

వాటర్ బాటిల్ చేతికిచ్చి, "సరే మీరు పని చూసుకోండి. వంట రెడీ చేస్తాను. భోజనం కోసం బయటికెళ్ళకండి." అని మరో మాటకి అవకాశమివ్వకుండా ఆవిడ తమ ఫ్లాట్ లోకెళ్ళిపోయారు.

పని మొదలు పెడదాం అనుకుంటూ ఉండగా, కింద ఫ్లాట్ వాళ్ళ అమ్మాయ్ బెల్ కొట్టి

"మీకొచ్చిన పోస్ట్, అమ్మ ఇచ్చి రమ్మంది!" అని ఒక పెద్ద బ్యాగ్ చేతిలో పెట్టి వెళ్ళింది.

లహరి సోఫాలో చతికిలబడింది. ఒక్కొక్క కవరే తీసి...ముఖ్యం కానివి చింపి చెత్త బుట్టలో పడేస్తూ, బ్యాంకుల నించి, ఇతర కంపెనీల నించి వచ్చిన ముఖ్యమైనవి కరెస్పాండెన్స్... పైన కవర్ని బట్టే పక్కకి పెట్టేస్తూ, ఒక్కొక్క కవరు చూస్తుంటే ఆశ్చర్యంవేసింది లహరికి. అమ్మ నాన్నలని ఆహ్వానిస్తూ వచ్చిన పెళ్ళిశుభలేఖలు, గృహ ప్రవేశ ఆహ్వానాలు, ఉపనయన ఆహ్వానాలు, ఊళ్ళో నిర్వహింపబడే సంగీత సభల తాలూకు కార్యక్రమాలు వివరించే సమాచారాలు.... ఇవన్నీ చూస్తూ "ఓహ్.. ఇందుకే అమ్మా..నాన్నా సంవత్సరమంతా బిజీగా ఉంటారు. తోచదు అనే మాట ఉండదు. అక్కడ కలిసే బంధువులు.. ఫ్రెండ్స్ తో జ్ఞాపకాలు కలబోసుకుంటూ, అనారోగ్యం అనే మాట లేకుండా, గలగల్లాడుతూ గడిపేస్తారు" అనుకుంది లహరి.

అలా వాటిని చూస్తూ .."ఈ నేలలో ఎంతో కాలంగా వేళ్ళు పాతుకుపోయి, ఈ వాతావరణంలో ఏపుగా ఎదిగి పదిమందికీ నీడనిస్తూ, ఆరోగ్యంగా పచ్చగా ఉన్న చెట్టుని పెకలించి.. మా ప్రేమ, బాధ్యత అనే పేరుతో తీసుకెళ్ళి మా నాలుగు గోడల మధ్య బంధించినప్పుడు, ఆ చెట్టు ఆ పరిస్థితులకి తట్టుకుని నిలబడగలదా... తన అస్తిత్వాన్ని కాపాడుకోగలదా అనే సందేహం మాకు కలగలేదు. మేము ఉద్యోగాలకి వెళ్ళిపోయాక, అలవాటులేని టీవీ ప్రోగ్రాంస్ చూస్తూ... మమ్మల్ని తిట్టలేరు కాబట్టి, వారికి అటువంటి పరిస్థితిని కల్పించిన కాలాన్ని తిట్టుకుంటూ గడిపేస్తున్నారు" అని మనసులో కలిగిన భావాన్ని పైకే గట్టిగానే అనేసింది. మధు ఒక్కసారి ఆమె మోహంలో చూసాడు.. ఏదో తెలియని ఎమోషనల్ అటాచ్మెంట్ కనబడింది.

తండ్రి రూం తాళం తీసేసరికి లహరి మనసు బరువెక్కింది. 'వేసవి సెలవలకి వచ్చినప్పుడు బాబు, పాప నాన్నతో కలిసి ఆ మంచం మీద చేసే అల్లరి, ఆడే ఆటలు ఓహ్ మాటల్లో చెప్పలేము. నాన్న తన వయసు మర్చిపోయి వాళ్ళతో కేరింతలు కొట్టేవారు.'

ఆ మంచం, నాన్న వార్డ్రోబ్, నాన్న డైరీ వ్రాసుకునే టేబుల్ చూస్తుంటే లహరి మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

***

"పిల్లలూ...నేను బ్రతికున్నంత కాలం ఇక ఈ ఇల్లు మార్చను. నా తుది శ్వాస ఇక్కడే తీసుకోవాలి" తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి .. తన షష్టి పూర్తికి వచ్చిన పిల్లలతో!

ఈ ఫ్లాట్ కొనుక్కున్నాక, పది రకాల ఫర్నిచర్ షాపులు తిరిగి తన హోదా, అభిరుచి ప్రతిబింబించే లాగా పెద్ద నల్ల చేవ మంచం కొనుక్కుని, దాని మీదకి అప్పటి తమ శారీరక అవసరాలకి తగ్గట్టు పరుపు ఆర్డర్ ఇచ్చి చేయించుకున్నారు. ముందు హాల్లోకి రిచ్ లుక్ ఉన్న సోఫా సెట్, ఉదయం బాల్కనీలో కులాసాగా..సౌకర్యంగా కూర్చుని పేపర్ చదువుకుని.. వీలైతే అక్కడే ఒక కునుకు తియ్యటానికి వీలుగా ఒక ఈజీ చెయిర్, అమ్మతో కబుర్లు చెబుతూ కాఫీ తాగుతూ ఊగటానికి ఒక ఉయ్యాల బల్ల...ఇలా అన్నీ ఏర్చి కూర్చి కొనుక్కున్నారు.

'తనకి ఊహ తెలిసినప్పటి నించీ తన కళ్ళముందు జరిగినవి కొన్నీ.. అమ్మ మాటల్లో విన్నవి కొన్నీ... నాన్న గురించి తమ బంధువుల్లో, ఫ్రెండ్స్ లో నలుగురూ అనుకోగా విన్నవి కొన్నీ!'

ఆ కాగితాలు చదువుతూ ఉంటే, ఒక్కటీ చిత్తుకాగితం అనిపించలేదు. అందరి నాన్నలకంటే మా నాన్న ఓ ప్రత్యేకం .. అనే ఆలోచనలు లహరి మస్తిష్కంలో మెరిసాయి! తన జీవితం తనకే అపురూపంగా కనపడింది!

మధ్య తరగతి జీవన సమరంలో ఎదురైన అనేక ఆటుపోటులని తట్టుకుని, కింద పడ్డప్పుడల్లా పట్టుదలతో పైకి లేచి నిలదొక్కుకున్నాడు విష్ణు మూర్తి" అనేవారు నలుగురూ నాన్న గురించి. వింటున్న మాకెంతో గర్వంగా ఉండేది. నలుగురితో నారాయణ లాగా బ్రతికే బ్రతుకు ఓ బ్రతుకా? ... వంద మంది లో వీడొక్కడే అన్నట్టు బ్రతకాలనేది నాన్న జీవితాశయం!

ఇంటికి పెద్ద కొడుకుగా.. తండ్రి బాధ్యతలు పంచుకుంటూ, తన ఆశయ సాధనలో ఎక్కడా రాజీ పడకుండా అహర్నిశం కష్టపడుతూ, తనతో అమ్మని, మమ్మల్ని కూడా పరుగులు పెట్టించారు. జీవితంలో ఒక్కో మెట్టే ఎక్కి అనుకున్న స్థాయికి చేరేసరికి మేం పెద్దవాళ్ళైపోయాం.

అన్నయ్య క్యాంపస్ సెలెక్షన్ లో వచ్చిన ఉద్యోగం చేస్తూ బెంగళూరులో ఉన్నాడు. నేను అన్నయ్య కంటే నాలుగేళ్ళు చిన్న. నేను కాలేజ్ టాపర్. ఇంజనీరింగ్ అయ్యాక, అమెరికా వెళ్ళి ఎమ్మెస్ చేస్తానని పట్టుబట్టి గొడవ చేశాను. అమ్మకి నన్ను అమెరికా పంపటం ఎంతమాత్రం ఇష్టం లేదు. ఆ మాటకొస్తే, అసలు పిల్లలు విదేశాలకి వెళ్ళటం అంటేనే అమ్మకి ఇష్టముండదు. మీ సత్తా ఇక్కడ నిరూపించుకోండి అనేది.

అమ్మకూడా ఉద్యోగం చేస్తూ, నాన్న లక్ష్య సాధన కోసం జీవితమంతా పెట్టిన పరుగుల వల్ల... వయసు కంటే ఎక్కువ అలిసిపోయింది.

ఉద్యోగం రిజైన్ చేసి, పిల్లల పెళ్ళిళ్ళు చేసి ... మేము ఇండియాలోనే మాకు నచ్చిన చోట సెటిల్ అయితే పండుగలకి .. పబ్బాలకి పరస్పరం ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ సరదాగా మనవలతో ఆడుకుంటూ ప్రశాంతంగా ... అప్పటి వరకు తను గడిపిన పరుగుల జీవితానికి ఫుల్స్ స్టాప్ పెట్టాలనుకున్నది అమ్మ.

కానీ నా చుట్టూ ఉన్న ప్రపంచం వేరు. నా అకడమిక్ రికార్డ్ చూసి అందరూ "ఏమ్మా అమెరికా ఎప్పుడు వెళుతున్నావు? ఏ యూనివర్సిటీ లో సీటొచ్చింది?" అని వేసే ప్రశ్నలతో...క్యాంపస్ సెలెక్షన్ లో వచ్చే ఉద్యోగం లో చేరి, అమ్మ చెప్పినట్టు పెళ్ళి చేసేసుకుని ఇక్కడే సెటిల్ అయిపోతే నలుగురూ తనని లోకువగా చూస్తారనే భావనతో పట్టుబట్టి అమెరికా వెళ్ళాను.

రెండేళ్ళ చదువయ్యాక, అక్కడే ఉద్యోగం చేస్తున్న మధుతో పెళ్ళి .. అన్నీ వరస వరసగా జరిగిపోయాయి. ఆ సంవత్సరమే అన్నయ్య పెళ్ళి కూడా తెలిసిన వాళ్ళమ్మాయితో జరిగిపోయింది.

కూతురు దూరంగా ఉన్నా, కొడుకు ఇండియాలో తమకి దగ్గరలో ఉన్నాడులే అని అమ్మ సంతోషించింది. ఆ సంతోషం ఎంతో కాలం నిలవకుండా, మూడేళ్ళ ప్రాజెక్ట్ పని మీద అన్నయ్య కూడా అమెరికా వచ్చేశాడు. అన్నయ్య కూడా తనకి దూరంగా అమెరికా వెళ్ళిపోవటంతో అమ్మని నిస్సత్తువ ఆవహించింది.

మా చిన్నతనంలో అమ్మకి ... ఊపిరి సలిపేది కాదు. ఉదయం కాఫీ కూడా కుర్చీలో పది నిముషాలు ప్రశాంతంగా కూర్చుని తాగిన గుర్తు లేదు. ఒక చేత్తో గ్లాస్ పట్టుకుని మరో చేత్తో కూరలు తరగటం.. బియ్యం కడిగి కుక్కర్ లో పెట్టటం.. ఇలా ఏదో గట గటా తాగాననిపించి.. తరువాత పనికి పరుగెత్తేది.

అందుకే అమ్మా నాన్నా రిటైర్మెంట్ లైఫ్ తమ ఇంట్లో ప్రశాంతంగా కబుర్లు చెప్పుకుంటూ గడపాలని.. ఇక జీవితంలో రాజీ అనేది లేకుండా బ్రతకాలని నిర్ణయించుకున్నారు.

***

అలా ఒక సంవత్సరం గడిచిందో లేదో.... "లహరికి ఇప్పుడు నాలుగో నెల. మీరు...అత్తగారు డెలివరీ సమయానికి అమెరికా వచ్చేట్లు ప్లాన్ చేసుకోండని"..వీసా చేయించుకోవటానికి కాయితాలు పంపించాడు మధు.

"నువ్వు వెళ్ళు, నేను తరువాత వస్తాను. నాకు అక్కడ తోచదు. ఇంట్లో కాళ్ళు చేతులు కట్టేసినట్టు నేనుండలేను. ఆడవారికి ఇంటి పనితో కాలక్షేపం అయిపోతుంది. నాకు తెలిసిన వాళ్ళెవరూ ఉండరు. అల్లుడు ఆఫీస్ కి వెళతాడు. వెధవ టీవీ ఎంత సేపు చూస్తాను!" అని నాన్న అమ్మనొక్కదాన్నే పంపారు.

దేశంకాని దేశంలో ముక్కూ..మొహం తెలియని మనుషుల మధ్య, తనకి నప్పని వాతావరణంలో అంట్లు తోముకుంటూ, బట్టలుతుక్కుంటూ విశ్రాంతి అనేది లేకుండా ఉన్న అమ్మని చూసి గిల్టీగా అనిపించేది. కానీ డెలివరీ సమయానికి అమ్మ తన పక్కన ఉంటే ధైర్యంగా ఉంటుంది అని మధు పట్టుబట్టి వాళ్ళకి వీసాలు చేయించాడు.

మనవడు పుట్టాక వాడితో ఆడుకుంటుంటే అమ్మకి కొంత కాలక్షేపం అయింది, కానీ ఇంటి పనితో అమ్మ సతమతమౌతుంటే జాలేసేది.

నాన్న వచ్చి ఒక నెల ఉండి వెళ్ళారు. అమ్మకి నాన్న అక్కడ ఎలా ఉన్నారో, తింటున్నారో.. లేదో అనే బెంగ. పసివాడి పాస్ పోర్ట్ రాగానే వాడి మూడో నెలలో అందరం ఇండియా వచ్చాం. వస్తూనే పంజరంలో నించి బయట పడ్డ చిలకల్లే అమ్మ తన మంచం, తన కుర్చీ చూసుకుని పోగొట్టుకున్న పెన్నిధి దొరికినట్లు ఆనంద పడింది. ఆ మంచం మీద పడుకుని ఒళ్ళు తెలియకుండా నిద్రపోయింది.

మరో రెండేళ్ళకి పాప పుట్టినప్పుడు అమ్మ వచ్చి నాలుగు నెలలు ఉండి వెళ్ళింది. షరా..నాన్న ఇండియాలో ఒక్కరే ఉన్నారు.

అమ్మా-నాన్న పెద్ద వాళ్ళౌతున్నారు. వారికి ఆరోగ్య సమస్యలు వస్తే చూసే వాళ్ళు లేరు...పరుగెత్తుకు రావాలంటే మాకు సెలవలుండవు. ఎటూ అన్నయ్య కూడా అక్కడే ఉన్నాడు కాబట్టి మా ఇద్దరి మధ్య తిరుగుతూ ఉండచ్చు! పిల్లలకి కూడా అమ్మమ్మ, తాతయ్యలతో గడిపినట్టుంటుంది! నేను ఉద్యోగంతో, పిల్లల పెంపకంతో సతమతమౌతున్నాను... సహాయంగా ఉండమని వాళ్ళని మా దగ్గరకి పిలిపించేసుకున్నాను.

ఇక అమ్మా-నాన్నా మనతో ఉంటారు, అక్కడ ఇల్లు.. సామాను వేస్ట్! నెల నెలా మెయింటెనెన్స్ చార్జీలు దండగ.. అని ఇల్లు ఖాళీ చేసి నెమ్మది మీద ఫ్లాట్ అమ్మెయ్యచ్చు అనుకున్నాం. దాని పర్యవసానమే ఇప్పుడీ ట్రిప్.

ఆలోచనల్లోంచి బయటపడి, సామాను సర్దటం మొదలు పెట్టింది లహరి!.

ఇప్పుడు కొంత సామాను సర్ది అక్కడికి పంపి, కొన్ని ఇక్కడే అమ్మేసి, మరికొన్ని ఏ ఆశ్రమాలకో డొనేట్ చేసి వెళదామని వచ్చారు.

తల్లి  రూం తాళం తీసింది. బెడ్ రూం లో సీలింగ్ ఫ్యాన్ కాక...ఒక పెడస్టల్ ఫ్యాను, ఒక వాల్ మౌంటింగ్ ఫ్యాన్..తలా ఒక డైరెక్షన్ లో పెట్టి ఉన్నాయి.

'పాపం అమ్మకి గాలి సమస్య .. ఎప్పుడూ ఫ్యాన్ తిరుగుతూ ఉండాలి. అందుకే బాత్ రూం లో కూడా ఫ్యాన్ పెట్టించుకున్నది.  పాపం ...అక్కడ మా ఇంట్లో ఫ్యాన్ లేక, క్రాస్ వెంటిలేషన్ లేక గిల గిల్లాడుతూ ఉంటుంది. అమ్మకి ఉన్న మోకాళ్ళ నొప్పుల సమస్యకి...కూర్చుని లేచేటప్పుడు ఇబ్బంది ఉండకూడదని సోఫాని ప్రత్యేకంగా డిజైన్ చేయించుకుంది. కాళ్ళ కింద ఎత్తుగా ఉండేటందుకు స్టూల్స్ కొనుక్కున్నది. బాత్ రూములో జారి పడిపోకుండా రఫ్ గా ఉండే టైల్స్..  పట్టుకు నడవటానికి పక్కన గోడలకి స్టీల్ రాడ్స్.. ఇలా ఒకటని కాదు, అన్నీ తమ అవసరాలకి తగ్గట్టు ఏర్పాటు చేసుకున్నారు.

ఇవన్నీ కాక అమెరికాలో ఎక్కువ భాగం ఇళ్ళు ఒకే లెవెల్లో ఉండవు. బెడ్ రూంస్ పై ఫ్లోర్ లో ఉండి అమ్మ మెట్లెక్కలేక ఇబ్బంది పడుతుంది.   అక్కడ మేము ఎన్ని మార్పు చేర్పులు చేసినా ఇక్కడి వీళ్ళ అవసరాలకి తగ్గట్టుగా కొన్ని చెయ్యలేము. రీసేల్ ప్రాబ్లెం వస్తుందని కొన్ని ఒప్పుకోరు.  టబ్బులోకి ఎక్కి దిగలేక మోకాళ్ళ నొప్పులతో బాధపడుతూ ఉంటారు. పడిపోతామనే భయంతో పట్టి పట్టి నడుస్తారు. నిలబడి స్నానాలు చెయ్యటం పాపం వారికి పెద్ద పరీక్ష!  ఇవన్నీ పెద్ద వాళ్ళకి కష్టమని మేము ఎప్పుడూ మనసు పెట్టి ఆలోచించలేదు.   మేము మీ ఆరోగ్య అవసరాలుచూస్తాము అని ఒక్క కారణం చూపించి.. వాళ్ళని ఇక్కడి నించి అమెరికా తరలించాము. పాపం ప్రతి విషయంలోనూ, రోజూ వాళ్ళకి కలిగే అసంతృప్తి.. అసౌకర్యం వ్యక్త పరచలేక మౌనంగా భరిస్తున్నారు!'

పాపం.. అమ్మ నాన్న ఎంత అమాయకులో..!

అప్పట్లో  తానూ  వాడుకునే బెడ్ రూం లో ఉన్న అలమర తీసి చూస్తే తన  కోసం.. పాప కోసం అమ్మ కొని పెట్టిన ఫైన్ కాటన్ బట్టలు, పాప కోసం పట్టు లంగా, రెండు లేటెస్ట్ డిజైన్ చీరలు కవర్లలో కనిపించాయి.  పై అరలో నా చిన్నప్పటి నించీ వాడుకున్న అనేక వస్తువులు, పుస్తకాలు, బొమ్మలు అమ్మ ఎంత జాగ్రత్తగా భద్ర పరిచిందో....!

"ఏమిటి సర్దకుండా ఎక్కడ పడితే అక్కడ కూర్చుండి పోతున్నావు? అసలు ప్యాక్ చేసే ఉద్దేశ్యం ఉందా? ఏం పట్టుకెళ్ళాలో, ఏవి ఇక్కడ అమ్మెయ్యాలో తేల్చుకున్నావా?" అంటూ మధు ఆ గదిలోకి వచ్చాడు.

"ఏమోనండి.. ఇక్కడ అమ్మా,నాన్న ఏర్పాటు చేసుకున్న వస్తువులు, ఫర్నిచర్ చూస్తుంటే, వాళ్ళని అక్కడికి తీసుకెళ్ళి తప్పు చేశామేమో అనిపిస్తోంది. వారి నీడన మా చిన్నతనం ఏ లోటూ లేకుండా హాయిగా నడిచిపోయింది. ఈ వయసులో, వాళ్ళకి తోచినప్పుడు నచ్చిన యాత్రలు చేసుకుంటూ, వాళ్ళ అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళతో గడుపుతూ, ప్రశాంతంగా ఫ్రెండ్స్, కొలీగ్స్ ఇళ్ళల్లో ఫంక్షన్స్ కి వెళుతూ గడపకుండా... వాళ్ళ కాళ్ళు చేతులు కట్టేసి మన దగ్గర పడుండమనటం న్యాయమా అనిపిస్తోంది" లహరి మనసు లోని మాటలు బయటకు వచ్చేసాయి.

"వారి పట్ల ప్రేమ, అక్కర అంటే అర్థం...వారికి నచ్చినట్లు బ్రతకనివ్వటం! వారి స్వేచ్ఛని అరికట్టి వారిని శాసించటం కాకూడదు కదా! అందుకే నేనొకటి ఆలోచిస్తున్నాను. మీరు కూడా ఆలోచించండి. అన్నయ్యతో కూడా చెబుతాను" తిరిగి తనే అంది.

"ఇదేమిటి..ఇంత దూరం వచ్చాక, అన్నీ ప్లాన్ చేశాక ఇప్పుడు మళ్ళీ మొదటికొచ్చావ్? ఇంతకీ కొత్తగా వచ్చిన ఆలోచన ఏమిటి" అన్నాడు.

"మా అమ్మా-నాన్న లాగా ఇక్కడే ఉండాలని కోరుకునే పెద్దవారి కోసం అక్కడ ఉండే మన బోటివాళ్ళం కొందరం కలిసి స్వచ్ఛంద సంస్థని ఒకదాన్ని ప్రారంభించి, అందులో మనము, మన తల్లిదండ్రులు సభ్యులై, దాన్ని హాస్పిటల్స్ లో ఉండే ఏ సర్వీస్ సంస్థలతో అయినా అనుసంధానం చేస్తే వీరికి కావలసిన రెగ్యులర్ ఆరోగ్య అవసరాలు తీరతాయి!"

"కేర్ హాస్పిటల్ కి అనుబంధంగా అలాంటి సర్వీస్ సంస్థ ఒకటి ఉన్నదని విన్నాను! ప్రతి సంవత్సరం కొంత అమౌంట్ పంపిస్తాం కనుక ఎవ్వరూ ఉచిత సేవ చెయ్యక్కరలేదు. సభ్యులు ఎవరి ఇళ్ళల్లో వారు ఉంటూ కూడా అన్ని సేవలు పొందుతారు. మన వాళ్ళు నిస్సహాయంగా లేరనే ధైర్యం మనకీ ఉంటుంది. వారానికి ఒకసారి ఆ సంస్థ వారు మొబైల్ వాన్ లో వచ్చి సరుకులు కొనిచ్చి, వీరి అన్ని అవసరాలు తీరుస్తారు. హాస్పిటల్ అవసరం ఉంటే వాళ్ళే తీసుకెళ్ళి చూపించి, ఇంటి దగ్గర దింపి వెళతారు!"

"ధనం మూలం ఇదం జగత్" అని డబ్బుంటే ఎన్ని ప్రయోగాలైనా చెయ్యచ్చు. అక్కడ కూర్చుని ఇక్కడి ప్రాజెక్టులు, ఇక్కడి వారు అక్కడి ప్రాజెక్టులు చెయ్యట్లేదా? అలాగే ఇదీను!"

"మా నాన్నకి ఒకరిద్దరు డాక్టర్ ఫ్రెండ్స్ ఉన్నారు. చాలా మంచి వాళ్ళు. వాళ్ళు ఎలాగూ ఇక్కడి నించి కదలరు. ఈ ట్రిప్ లో వారితో సాధ్యాసాధ్యాలు మాట్లాడి, కొన్ని క్షేత్ర స్థాయి పనులు చేస్తే.. అక్కడ సుఖంగా బ్రతకలేని చాలా మంది తల్లిదండ్రులకి ఒక చక్కని ప్రత్యామ్నాయం కనుక్కున్నట్టు ఉంటుంది. ప్రతి ఇంట్లోను పిల్లలు విదేశాలు వెళ్ళి, తల్లి దండ్రులు ఒక్కరే మిగులుతున్నారు. వాళ్ళు అక్కడికొచ్చి ఉండటానికి ఇష్టపడట్లేదు. కొంత మందికి ఆ వాతావరణం సరిపడక రావట్లేదు!"

"వారికి అనారోగ్యాలు వచ్చినప్పుడు రాలేక...చనిపోయినప్పుడు వచ్చి డెత్ సర్టిఫికెట్లు, లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు తీసుకుని ఆస్తి పాస్తులు పంచుకోవటానికి కాదు పిల్లలుండేది!"

"ఇద్దరు పిల్లలం ఉంటే... సంవత్సరానికి చెరోసారీ, వాళ్ళు వచ్చి వీరితో గడిపి వెళితే వాళ్ళ స్థావరంలోనే వాళ్ళు ఆనందంగా, తృప్తిగా బ్రతుకుతారు అనిపిస్తోంది! ఇది కనుక మనం విజయవంతంగా ప్లాన్ చేసి అమలు పరచగలిగితే, చాలా మంది పెద్దల ఆవేదనకి పరిష్కారం దొరికినట్లౌతుంది"

లహరి అలా మాట్లాడుతుంటే, మధు.. భగవత్ గీత వింటున్న అర్జునుడిలా ఉండిపోయాడు.

"ఇంకో ఆలోచన కూడా వచ్చిందండి. అదేంటంటే... పెద్ద కంపెనీలలో ఉద్యోగులకి ఆఫర్ లెటర్ ఇచ్చేటప్పుడే....తమ నెల జీతంలో కొంత శాతం మినహాయించి "తల్లిదండ్రుల సంక్షేమ నిధి" లో జమ చేసేట్లు ఉద్యోగస్థుల దగ్గర ఒక ఆమోద పత్రం తీసుకోవాలి. అలా వసూలు చేసిన అమౌంట్, ఆ కంపెనీ వారే, ఇక్కడ మనం చెప్పిన స్వచ్ఛంద సంస్థ వారికి బదిలీ చేసే పద్ధతి ఉంటే, ఇక్కడి ఉద్యోగస్థుల తల్లిదండ్రుల సంక్షేమం విషయంలో రెండంచెల బాధ్యత నిర్ణయించినట్లవుతుంది."

"అలాగే కంపెనీలు ప్రతి ప్రాజెక్ట్ ముగిసిన తరువాత పదిహేను రోజులు తమ తల్లిదండ్రులని చూసి రావటానికి అనుమతి కూడా తప్పనిసరిగా ఇవ్వాలి".

"ఈ ఉద్యోగులని ఆ దేశాలకి తరలించి, కుటుంబాలకి దూరం చేసి, వారిద్వారా అంతంత ఆదాయాలు ఆర్జించేటప్పుడు.. ఆ కంపెనీలు ఆ మాత్రం బాధ్యత పంచుకోవటం కష్టమేమీ కాదు. ఆలోచనంటూ వస్తే, ఆచరణ అదే సాధ్యపడుతుంది!"


"అప్పుడు ఆ దేశాల్లో ఉండి ఉద్యోగం చేసుకుంటున్నా.. తమ తల్లిదండ్రుల యోగ క్షేమాలు గాలికి వదిలేశామన్న బెంగ వారికి ఉండదు. ఇలాంటి వాటికి కంపెనీలే బాధ్యత వహిస్తే సంస్థాపరమైన అజమాయిషీ, జవాబుదారీతనమూ కూడా పెరుగుతాయి!!" లహరి తన ఆలోచనల్ని చెప్పింది.

ఆ గంటలో ఆమెకి వచ్చిన ఆలోచనలు, ప్రణాళికలు వినేసరికి, మధు ఆశ్చర్య పోయాడు!

"ఆలోచన అయితే బాగానే ఉన్నది. ఇక్కడ సైనిక్ పురిలో ఉండే సాకేత్ అనే సీనియర్ సిటిజెన్ సంస్థ ని కూడా కొన్ని వివరాల కోసం సంప్రదించచ్చు. మా బంధువులు అక్కడ ఉన్నారు. వారి దగ్గర కూడా సౌకర్యాలు బాగానే ఉన్నాయిట. కానీ అక్కడ ఉంటేనే అవి కుదురుతాయి!! అది ఆశ్రమమే అవుతుంది గాని, ఇల్లు అవదు!! నువ్వు చెప్పిన ఆలోచన అయితే, తల్లిదండ్రులు తమకి నచ్చినట్టు కట్టించుకున్న వారి స్వంత ఇంట్లోనే ఉండచ్చు. మీ అన్నయ్యతో కూడా మాట్లాడదాము. నా ఫ్రెండ్స్ కొందరు కూడా మన ఈ ప్లాన్ కి కలిసి రావచ్చు. పద.. లంచ్ చేసి నువ్వు చెప్పిన ఆ డాక్టర్స్ ఉన్నారేమో ఫోన్ చేసి వెళ్లి కలుద్దాం!!" అంటూ మధు లేచాడు.

ఆలశ్యంగా నైనా ఒక మంచి ఆలోచన చెయ్యగలిగినందుకు సంతోషించి, ఎక్కడ సామాను అక్కడ సర్ది.. తేలిక పడిన మనసుతో ఫ్లాట్ కి పాత తాళం కప్ప వేసింది లహరి!!

**O**



# వినదగునెవ్వరు చెప్పిన

ఆగస్ట్ "కథామంజరి" లో కథలన్నీ బాగున్నాయి. మొదటి బహుమతి పొందిన వసుంధరగారి "కారే రాజులు" అన్నింటికన్నా బాగుంది. వాసి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఇలాగే చక్కటి కథలు అందిస్తూ "కథామంజరి" పాఠకుల అభిమానాన్ని చూరగొనాలనీ, పదికాలాలపాటు వర్ధిల్లాలనీ మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ

కృపాకర్ పోతుల, హైదరబాద్

కథామంజరి జులై, ఆగస్టు సంచికలు చదివాను. పత్రిక సర్వాంగ సుందరంగా ఉంది. సంపాదకులు, ప్రచురుణకర్తలు ఎంతో శ్రద్ధ తీసుకుని మంచి కథలను ఎంపిక చేసి ప్రచురించినందుకు అభినందనలు!

మోచర్ల అనంత పద్మనాభరావు, హైదరాబాద్

పుస్తకం చక్కగా అలంకరించారు. కథలు అన్నీ చాలా బాగున్నాయి. బహుమతులు పొందిన కథలకే కాకుండా, మిగతా కథలకు కూడా కొంచెం పెద్ద బొమ్మలు వేస్తే బాగుంటుందేమో ? ఆలోచన చేయగలరు.

మంచి విలువలతో కూడిన పత్రిక తీసుకువచ్చిన మీ సంపాదకవర్గానికి అభినందనలు.

బుద్ధవరపు కామేశ్వరరావు, బెంగుళూరు

చాలా కాలం తర్వాత, నాలోని చదివే ఓ ఆలోచనని తట్టి లేపింది "కథామంజరి". ఈ నెల కథలు అన్ని బాగున్నాయి. ప్రతి కథా ఓ అణిముత్యమే! తరచి చూస్తే, ప్రతి కథలోను మరుగన పడిపోతున్న మానవతా విలువలని రచయితలు కథలలో బాగా వ్యక్తీకరించారు. మనం భయపడుతున్నట్టు.. విలువలు తగ్గిపోవడం లేదు, అవి మన రక్తంలో కలిసి, తరతరాలు అందిస్తున్నాయని అనిపించింది. చదివిన వెంటనే స్పందిచేటట్టు పుస్తకం ఉంది.
యస్.ఆర్.ఆర్. సుధాకర్, దేవరాపల్లి

జులై సంచికను నాకు ద్విభాష్యం గారు దయతో పంపించారు. నేను మర్చిపోయాను. అనుకోకుండా ఈరోజు చూసి, మొత్తం చదివాను. కథలన్నీ వెరైటీగా బావున్నాయి. మీకు, శ్రీ రాజేశ్వరరావుగారికి ధన్యవాదాలు...
భవదీయుడు,
సకలాభక్తుల కృష్ణ మూర్తి, బెంగుళూరు

# ధన్యవాదాలు

